ముగ్గురు ఎంపీలు ప్రమాణం

తెలుగులో పురందేశ్వరి.. ఇంగ్లీష్‌లో హరీష్, ఉదయ్



దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం



గంటి హరీష్ మాధుర్ బాలయోగి, అమలాపురం



తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ

రాజమహేంద్రవరం అర్బన్/అమలాపురం/కార్పొరేషన్(కాకినాడ), జూన్ 24 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎన్నికైన ముగ్గురు కూటమి పార్లమెంట్ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు.ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రమాణస్వీకారం చేయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీగా ఎన్నికైన దగ్గుబాటి పురందేశ్వరి అనే నేను అంటూ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ ముగించారు. అమలాపురం రిజర్వు లోక్‌సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన గంటి హరీష్‌బాలయోగి ఆంగ్లంలో ప్రమాణపత్రాన్ని చదివారు. ప్రమాణ స్వీకారం అనంతరం హరీష్ ప్రొటెం స్పీకర్‌ను కలిశారు. పార్లమెంటులో టీడీపీ విప్‌గా ఇప్పటికే నియమితులైన హరీష్ చాంబర్‌లో కొలువుదీరారు. కాకినాడ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఇంగ్లీష్‌లో ప్రమాణ పత్రాన్ని చదివారు. తొలిసారి ఎంపీలుగా గంటి హరీష్ మాధుర్, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికవడం గమనార్హం. రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎంపీ పురందేశ్వరి తెలిపారు.టీడీపీ ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన కోనసీమ జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తానన్నారు.కాకినాడ ఎంపీ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ అభివృద్ధికి తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. భవిష్యత్‌లో కాకినాడ సరికొత్త అభివృద్ధి పథకాలతో వెలుగుతుందని తెలిపారు.

తూర్పు కలెక్టర్‌గా 26 నెలలు పనిచేశా..

రిలీవ్ అయిన మాధవీలత..జేసీకి బాధ్యతలు అప్పగింత

రేపు కొత్త కలెక్టర్ ప్రశాంతి బాధ్యతల స్వీకరణ



జిల్లాలో కలెక్టర్ మాధవీలత చివరి సంతకం

రాజమహేంద్రవరం,జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా విధి నిర్వహణ ఎంతో సంతృప్తినిచ్చిందని జిల్లా కలెక్టర్‌గా డా.కె.మాధవీలత అన్నారు. తన బాధ్యతల నుంచి సోమవారం రిలీవ్ అయ్యారు. జిల్లాలో వినూత్నంగా చిన్నారుల ఆరోగ్యం కోసం అమలు చేసిన బంగారు కొండ పథకం తనకు మధురానుభూతిని కలిగించిందన్నారు. తూర్పుగోదావరి జిల్లా తొలి కలెక్టర్‌గా 2022 ఏప్రిల్ 4న బాధ్య తలు తీసుకున్నానని.26 నెలలు జిల్లాలో సేవలందించానన్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం మాధవీ లతను బదిలీ చేసి జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో పి.ప్రశాంతిని నియమించారు. కొత్త కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. ఈలోపు కలెక్టర్ మాధవీలత బాధ్యతల నుంచి తప్పుకుని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌కు అప్పగించారు.

అమలు ఐదు..

బాబు చెప్పారు..చేస్తున్నారు..



తొలి కేబినెట్ భేటీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

హామీల అమలెప్పుడు.. ఎలా చేస్తారు.. ఏం చేస్తారు.. కూటమి అధికారం చేపట్టి 20 రోజులైందో లేదో.. ఇదీ వైసీపీ నాయకుల తీరు.. నిన్నటి వరకూ అధికారంలో ఉన్నా పాలన అంటే ఏంటో తెలియనట్టు మాట్లాడుతున్నారు. అయితే చంద్రబాబు మాత్రం తగ్గేదేలే అంటున్నారు.. అనుకున్న సమయానికి అన్ని హామీలు అమలు చేసేలా కార్యరంగంలో దూకుడుగా పోతున్నారు.. చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలంటే చాలా కష్టమనేది వైసీపీ నాయకుల వాదన.. అయితే అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం తానేంటో నిరూపించుకునే పనిలో పడ్డారు.దీనిలో భాగంగా సోమవారం నిర్వహించిన తొలి మంత్రివర్గ భేటీలోనే ఐదు ప్రాధాన్యత అంశాలకు ఆమోదం తెలిపారు.

ఉమ్మడి జిల్లాగా డీఎస్సీ

మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ తొలిసంతకం చేశారు. ఆగస్టు నుంచే దరఖాస్తులు స్వీకరించి డిసెంబర్‌లోపు పోస్టింగ్‌లు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నారు.కొత్త జిల్లాలు ఏర్పడినా డీఎస్సీ పాత జిల్లాల వారీగా నిర్వహించనున్నట్టు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాల వారీ లెక్కలే వేస్తున్నారు. కొత్త తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి డివిజన్ పరిధిలోని వారికి కాకినాడ జిల్లా విద్యాధికారి, కొవ్వూరు డివిజన్‌కు ఏలూరు జిల్లా విద్యాధికారి డీఎస్సీ నిర్వహిస్తారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న కొత్త తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారులు ఇంత వరకూ జిల్లాలో ఎన్ని ఖాళీలు ఉన్నాయి..ఏ ఏ సబ్జెక్టులు ఉన్నాయో కూడా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. కానీ మెగా డీఎస్సీ నిర్వ హణ నిర్ణయంపై నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు..

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందపడుతున్నారు. వైసీపీ తెచ్చిన ఈ చట్టం వల్ల తమ భూములన్నీ ఆక్రమణలకు గురవుతాయని, పెద్దలదే పెత్తనం అవుతుందని భయపడిన సంగతి తెలిసిందే. వైసీపీ ఓడిపోయిన తర్వాత బయటకు వస్తున్న వారి ప్యాలెస్‌ల వ్యవహారం చూస్తుంటే ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వెనుక పెద్ద కుట్ర ఉండేమోననే చర్చ కూడా జరుగుతోంది. కానీ ఎన్నికల ముందు చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేయడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఆనందపడుతున్నారు. భూములకు ఇబ్బందిలేదని అంటున్నారు.

ఆగస్టు నుంచి అన్న క్యాంటీన్లు

ఇక అన్న క్యాంటీన్ల పునరుద్ధరించాలని కూడా కేబినెట్ ఆమోదించింది. ఆగస్టు 15వ తేదీ నుంచి ఒకేసారి అమల్లోకి తేవాలని యోచిస్తున్నట్టు సమాచారం. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదల కోసం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో రాజమహేంద్రవరంలో రెండు, నిడదవోలులో ఒకటి, కొవ్వూరులో ఒకటి ఉన్నాయి. ఆసుపత్రుల వద్ద, ప్రముఖ కూడళ్లలో క్యాంటీన్లను ఏర్పాటు చేసి రూ.5లకే భోజనం పెట్టేవారు. 2019లో జగన్ సీఎంకాగానే వీటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. వీటిని తెరవనున్నారు.

- తొలి కేబినెట్ భేటీలోనే చర్చ
- ఐదు హామీలకు ఆమోద ముద్ర
- పింఛన్ వచ్చే నెల రూ.7 వేలు
- ఆ తరువాత నుంచి రూ.4 వేలు
- జిల్లాలో 2.42 లక్షల పింఛన్లు
- డీఎస్సీ ఫైలుపైనా సంతకం
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు
- అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సిగ్నల్
- నైపుణ్య గణనకు ప్రణాళిక
- పరిశ్రమల వారీగా అధికారుల లెక్క

1న ఇంటికే పింఛన్..

జూలై 1వ తేదీన పింఛన్ సొమ్ము రూ..7వేలు వస్తుంది. అది ఇంటికి తెచ్చే ఇస్తారు. ఆగస్టు నుంచి ప్రతి నెలా రూ.4 వేల వంతున ఇస్తారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రూ.3 వేలుగా ఉన్న పింఛన్‌ను రూ.4 వేలుకు పెంచడంతో పాటు దానిని ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని చెప్పారు.ఈ పింఛన్ పథకానికి ఎన్టీఆర్ భరోసా అని పేరు పెట్టారు.ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.3 వేలు చొప్పున మాత్రమే పింఛన్ ఇచ్చారు. చంద్రబాబు ఏప్రిల్ లో తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో ఇచ్చిన హామీ మేర కు మరో వెయ్యి కలిపి మూడు నెలలకు మూడు వేలు.. జూలై నెల పింఛన్ రూ.4 వేలు.. మొత్తం రూ.7 వేలను జూలై1న ఒక్కో పింఛన్‌దారుడికి ఇస్తారు. సచివాల య ఉద్యోగులు ఇంటింటికి ఇచ్చేలా ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పింఛనుదారులు ఆనందంలో మునిగిపోయారు. రూ.3 వేలు ఇచ్చేవారికి రూ.4 వేలు చేయడంతో పాటు, దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, రూ.15 వేలు కూడా చేయడం గమనార్హం. ఇక జిల్లాలో నెలకు పింఛన్ సొమ్ము రూ.102 కోట్లు అవుతుంది. జిల్లాలో ఒక్కో పింఛనుదారుడికి నెలకు రూ.4 వేలు, దివ్యాంగ పింఛన్ రూ.6 వేలు చేయడం వల్ల సుమారు నెలకు రూ.30 కోట్లు అదనంగా అవసరమవుతుందని అంచనా వేస్తుంది. జిల్లాలో మొత్తం 18 రకాల పింఛను లబ్ధిదారులు 2,42,300 మంది ఉన్నారు.

నైపుణ్య గణన

కొత్తగా చంద్రబాబు నైపుణ్య గణన అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.దీనికి కూడా కేబినెట్ ఆమోదించింది. ప్రతి ఇంటా సర్వే చేస్తారు. ఎవరికి ఏ నైపుణ్యం ఉందో వివరాలు సేకరించి తదనుకుణంగా కొన్ని మేలు చేసే నిర్ణయాలు అమలు చేయనున్నారు. ఈ పథకం కూడా అన్ని వర్గాలకు మేలు చేయనుంది. దీనిపై ఒక ట్రెండు రోజుల్లో పూర్తి స్థాయి గైడ్‌లైన్స్ రానున్నాయి. ప్రస్తుతం నైపుణ్య అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం ఓ బాధ్యత అప్పగించింది. జిల్లాలోని అన్ని పరిశ్రమలను పరిశీలించి, అక్కడ ఎంత మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.ఎంత జీతం ఇస్తున్నారు.అసలు అక్కడ ఎంత మంది ఉద్యోగులు ఉండాలి అనే వివరాలను సేకరించమని ఆదేశించింది. అధికారులు రంగంలోకి దిగారు.



రాజమహేంద్రవరం బస్టాండ్‌లో విజయవాడ బస్ వద్ద ప్రయాణికుల క్యూ

రైళ్ల రద్దు.. బస్‌లకు డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24 : రైల్వే ట్రాక్ ఆధునీకరణ పనుల నిమిత్తం విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే 24 రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేయడంతో ఆర్టీసీ బస్సులకు డిమాండ్ పెరిగింది. దీంతో విజయవాడ, విశాఖపట్నం రూట్లలో నడిచే షెడ్యూలు ఆర్టీసీ సర్వీసులకు ప్రయాణికుల రద్దీ పెరగనుంది. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రతిరోజూ ఈ రెండు రూట్లలోనూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల నిమిత్తం ఉదయం వెళ్లి రాత్రికల్లా తిరిగి వచ్చేస్తుంటారు. గతంలో వీరంతా రైళ్లలో ప్రయాణించేవారు. అయితే ప్రస్తుతం రైళ్ల రద్దుతో బస్‌లకు డిమాండ్ పెరగనుంది. ఇదే డిమాండ్ విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే రైళ్లకు కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో ఈ రెండు ప్రధాన నగరాల మధ్య డైలీ నడిచే రత్నాచల్, జన్మభూమి వంటి కొన్ని ప్రధాన రైళ్లను దాదాపు నెలన్నరపాటు రద్దు చేయడం ఆర్టీసీకి వరంగా పరిణమించనుంది. రాజమహేంద్రవరం డిపో నుంచి ప్రతిరోజూ మొత్తం 14 సూపర్‌డీలక్స్ సర్వీసులు షెడ్యూలు సర్వీసులుగా విజయవాడ వెళ్లి వస్తుంటాయి. కొవ్వూరు డిపో నుంచి ఒకటి నడుపుతున్నారు. ప్రతిరోజూ హైదరాబాద్‌కు వయా విజయవాడ మరో నాలుగు బస్సులు వెళుతుంటాయి. మరోపక్క విశాఖపట్నం, ఇచ్ఛాపురం రూటులో డైలీ 17 సర్వీసులు నడుపుతున్నారు. రైళ్లు రద్దు కావడంతో చాలా మంది ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఆశ్రయించక తప్పనిసరి పరిస్థితి నెలకొంది. దాదాపుగా ప్రైవేట్ ట్రావెల్స్ అన్నీ సాయంత్రం, రాత్రి మాత్రమే నడుస్తాయి. పగటిపూట విజయవాడ,విశాఖపట్నం వెళ్లాలంటే ఆర్టీసీ సర్వీసులే ప్రధాన ఆధారం. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్టీసీ అధికారులు ఈ అవకాశాన్ని ఎంత మేర సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంచుకుంటారనేది చూడాలి.

డయేరియా నియంత్రణకు రెండు నెలల కార్యాచరణ

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకూడదనే లక్ష్యంతో వైద్య, ఆరోగ్యశాఖ జిల్లాస్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి సమాయత్తమవుతోంది. రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ రెండు నెలలపాటు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని నిర్ణయించారు. వైద్య సిబ్బంది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందిస్తారు. డయేరియా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్గిస్తారు. శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, శుద్ధమైన తాగునీరు వంటి వాటితోపాటు అనుబంధశాఖలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, గ్రామీణ నీటి యాజమాన్యసంస్థ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను కూడా సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచడం జరిగిందని, పట్టణ ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపయిన్ చేపట్టడానికి సమన్వయశాఖల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రయాణికులను ఇబ్బంది పెట్టొద్దు

రైల్వేకు ఎమ్మెల్యే వాసు విజ్ఞప్తి

రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): కడియం-నిడదవోలు మధ్య మరమ్మతులకు 22 రైళ్లు తాత్కాలికంగా రద్దు చేసిన కారణంగా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేశారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ నుంచి వేలాది మంది రాకపోకలు సాగిస్తారన్నారు. రత్నాచల్, జన్మభూమికి రద్దీ ఎక్కువగా ఉంటుందని గుర్తు చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల దిశగా రైల్వే ఆలోచన చేయాలన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రైళ్ల రద్దు వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ డీఎంకి సూచించామన్నారు. డిమాండ్ మేరకు సర్వీసులను పెంచాలన్నారు. ఎంపీ పురందేశ్వరి ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత మళ్లీ సమీక్ష చేస్తామన్నారని తెలిపారు. ఎవరికైనా ఇబ్బందులుంటే తెలియజేస్తే వాటి ఆధారంగా తగు చర్యలు తీసుకోడా నికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సమస్య మీది.. పరిష్కారం మాది..



కలెక్టరేట్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ మాధవీలత

కూటమి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం

- కలెక్టరేట్‌లో 84 అర్జీలు స్వీకరణ
- మూడు నెలల తర్వాత నిర్వహణ
- క్యూకట్టిన బాధితులు
- పలు సమస్యలతో హాజరు
- పరిష్కరించాలని ఆదేశాలు
- జిల్లా అధికారులంతా హాజరు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూన్ 24 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత మార్చి నెలలో నిలిచిపోయిన స్పందన కార్యక్రమం ప్రభుత్వం మారడంతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్)గా మళ్లీ ప్రజలముందు కొచ్చింది. సుమారు మూడు నెలల పాటు కార్యక్రమం నిలిచిపోయింది. ప్రభుత్వం మారడంతో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నూతన ప్రభుత్వం చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్)ను సోమవారం రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో బదిలీ కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత, జేసీ తేజ్‌భరత్, డీఆర్‌వో జి.నరసింహులు ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. తొలుత జేసీ తేజ్ భరత్, డీఆర్‌వో జి.నరసింహులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలి రోజు 84 అర్జీలు అందాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన రైతు మన్యం సత్యనారాయణ మూర్తి తన 7.50 ఎకరాల భూమి టిడ్కో ఇళ్ల కాలనీ మురుగునీటితో నిండి వ్యవసాయానికి పనికిరాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఉన్న భూమి టిడ్కో ఇళ్ల సరిహద్దుల్లో ఉండ డం..ఆర్అండ్‌బీ వాళ్లు రోడ్డు వెడల్పు చేసి పంటకాలువ మూసివేయడంతో సమస్య వచ్చిందని తెలిపారు.పంటకాలువను పునరుద్ధరించి న్యాయం చేయాలని కోరారు.సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. నూతన ప్రభుత్వంలో తొలి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కావడంతో అన్ని విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

24 అర్జీలు..3 తక్షణ పరిష్కారం

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రారంభించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు రాజమహేంద్రవరం కమిషనర్ పరిష్కంచారు. సోమవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ దినేష్ కుమార్ నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 24 అర్జీలు రాగా 3 అర్జీలను సోమవారమే పరిష్కరించారు. రాజేంద్రనగర్‌కు చెందిన ఎన్‌జే లివింగ్ స్టన్ ఇంటి పన్నును తన కుమారుడు పేరిట మార్చాలని పన్ను సవరించాలని అర్జీ అందజేశారు. సాయంత్రానికి పరిష్కరించి వారి కుమారుడు నూతనపాటి రాకేష్ , రాహుల్ కిరణ్‌ల పేరిట కొత్త పన్నులు విధించి ఇచ్చారు. నారాయణ పురంలో వీధి దీపాలు పనిచేయడంలేని వీరభద్రస్వామి అర్జీ ఇవ్వడంతో వెంటనే వీధి దీపాలను పెట్టించారు. కృష్ణనగర్‌లో బురదను తొలగింపజేయాలని ,బ్లీచింగ్ చల్లించాలని అర్జీ పెట్టుకున్నారు. దీనిపై స్పందించి సమస్యను పరిష్కరించారు.



జనటిక్ సమస్య.. ఆదుకోండి..

దుద్దుకూరు గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు అభినయ్ జనటిక్ సమస్యతో పుట్టడంతో పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు రాజాభూషణ, ప్రత్యూష వైద్యం చేయిస్తున్నారు. అయితే ఆ బాలుడికి మందులు బెంగళూరు నుంచి రప్పించడంతో నెలకు రూ.40 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ఆ ఖర్చు తట్టుకోలేక ప్రభుత్వ సహాయం కోసం కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ పెట్టుకున్నారు. గతంలో కూడా వీరు అర్జీ పెట్టుకుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారని.. అక్కడ బాబుకు అవసరమైన మందులు లేవని చెబుతున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆరోగ్యశ్రీ విభాగం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పరిశీలన చేసి బాలుడికి వైద్యం అందించాలని సూచించారు.



ఒంటరిని.. రేషన్ కార్డు ఇప్పించండి

నిడదవోలుకు చెందిన దివ్యాంగుడు వంగ కృపానంద వరప్రసాద్ తాను ఒంటరినని.. తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని జేసీ తేజ్ భరత్‌ను వేడుకున్నాడు.దీనిపై స్పందించిన ఆయన ఒంటరిగా ఉన్నవారికి కార్డు రాకపోవచ్చని చెప్పారు.అయినా వెంటనే సంబంధిత అధికారులను పిలిచి వరప్రసాద్‌కు రైస్ కార్డు ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు. సదరం సర్టిఫికెట్‌లో ఉన్న సమస్యను డీఎంహెచ్‌వోకు విన్నవించాడు.

ఎస్పీ 'మీ కోసం'కు 20 ఫిర్యాదులు



రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం' (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 20 అర్జీలను స్వీకరించిన ఎస్పీ.. వాటికి త్వరతగతిన పరిష్కారం చూపాలని ఆదేశిస్తూ సంబంధిత అధికారులకు పంపించారు. జగదీశ్ ఎస్పీగా వచ్చిన తర్వాత ప్రారంభించిన జూమ్ విధానంలో గ్రీవెన్స్ ద్వారా కూడా పలువురు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు.పలు సమస్యలపై ఆయా పోలీసు అధికారులతో జూమ్ ద్వారా ఎస్పీ మాట్లాడి అప్పటికప్పుడు పరిష్కారం చూపారు.

నల్లజర్లలో అధికారులు ఏరీ!



నల్లజర్ల మండల కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీ

నల్లజర్ల,జూన్ 24 : ప్రభుత్వ అధికారులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉన్న పట్టించుకోలేదు.నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఐదుగురు సిబ్బ ంది విధుల్లో ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు అధికారులే హాజరయ్యా రు.ఎంపీడీవో,ఏవో,మరో అధికారి కార్యాలయంలో లేరు.మండలంలో ఏఈ పీఆర్,అర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జాడ కానరాలేదు.సచివాలయ సిబ్బంది హాజరు అంతంత మాత్రంగానే ఉండడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గోదావరినీ
వదలని 'షెకావత్'



మైదాన మత్స్యకారులతో గిరిజన మత్స్యకారుల వాగ్వాదం

ఆయన జమానాలో నిర్వాసిత మత్స్యకార్ల హక్కులను అమ్మేసిన అటవీ అధికారులు

లంకలను అడ్డా చేసుకుని గోదావరి రెండు ఒడ్డుల మధ్య మత్స్య సంపద దోపిడీ

లైసెన్సులు ఉన్న నిర్వాసితులను అణచివేసి అంతర్రాష్ట్ర వేటగాళ్లకు ప్రోత్సాహం





అటవీ శాఖ స్వాధీనంలో ఉన్న పడవలు

(ఆంధ్రజ్యోతి నిఘా విభాగం):

రంపచోడవరం అటవీ డివిజన్‌లో షెకావత్ అవతారమెత్తిన అటవీ అధికారి తన బృందం అక్రమాలకు అటవీ సంపదనే కాకుండా పాపికొండల అభయారణ్యంలోని గోదావరి పరివాహక ప్రాంతాన్నీ వదలలేదు. కాదేది అక్రమాలకు అనర్హం అన్న చందంగా గోదావరి పరివాహక ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే గ్రామాలు ఖాళీ కావడంతో అక్కడ అక్రమాలకు తెరతీశారు. గోదావరిలో మత్స్య సంపద వేట హక్కులను కలిగిన నిర్వాసిత గిరిజనులపై ఆంక్షలు విధించి అంతరాష్ట్ర మత్స్య వేటగాళ్లకు గోదావరిపై గిరిజనులకు ఉన్న హక్కులను అమ్మేశారు. వివరాల్లోకి వెళితే...పోలవరం నిర్మాణంతో ముంపునకు గురయ్యే గ్రామాల గిరిజన నిర్వాసితులకు చట్ట ప్రకారం పునరావాస చర్యలలో భాగంగా గోదావరిలో చేపల వేట హక్కులను మంజూరు చేశారు. లైసెన్సులను కూడా అందించారు. నిర్వాసిత గిరిజనులు సంప్రదాయబద్ధంగా మత్స్య సంపద మనుగడ దెబ్బ తినకుండా వేట సాగించేవారు. క్రమం తప్పకుండా చేప పిల్లలను గోదావరిలో వదిలేవారు. ఈ చర్యలతో గోదావరిలో మత్స్య సంపద పెరగడంతో దళారీల కన్ను పడింది. దీంతో కొంతమంది దళారులు మైదాన ప్రాంతాల నుంచి మత్స్యకారులను రహస్యంగా గోదావరి అవతల ఒడ్డు నుంచి, కాఫర్ డ్యామ్ ద్వారా రప్పించి రహస్య వేట సాగించడం మొదలుపెట్టారు. రాను రాను ఇది గోదావరిలో మత్స్య సంపద దోపిడీ ముఠాగా మారింది. ఇది క్రమేణా గిరిజన నిర్వాసిత మత్స్యకారుల మనుగడను, గోదావరిలో మత్స్య సంపద మనుగడను దెబ్బతీసేలా పరిణమించింది. చేప పెరగకుండానే పిల్లలుగా ఉన్నప్పుడే వేటాడేస్తున్నారు. గోదావరిలో సాగుతున్న అంతరాష్ట్ర మత్స్యకారుల దోపిడీ వేటను నిరోధించాలని గిరిజన నిర్వాసితులు అటవీ అధికారులకు, పోలీసు అధికారులకు, ఐటీడీఏకు ఎన్ని ఫిర్యాదులు చేసినా, ఎన్ని ఆందోళనలు చేసినా గత ప్రభుత్వ అండదండల కారణంగా ఎటువంటి చర్యలూ లేవు. మొక్కుబడిగా కొన్ని పడవలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయంలో ఉంచుకుని ఊరుకున్నారు. అంతేకాక ఈ దోపిడీని నిరోధించాల్సిన అటవీ శాఖ ఉన్నతాధికారులే దీనిని ప్రోత్సహించడం, ఈ దోపిడీని ఎదురించే గిరిజన మత్స్యకారులను ఇబ్బందులు పెట్టడం, పాపికొండల అభయారణ్యం పేరుతో గిరిజనులపైనే అటవీ చట్టాలను ప్రయోగించడం తదితర చర్యలతో గిరిజనుల అడ్డు లేకుండా చేసి తద్వారా పరోక్షంగా అక్రమ దందాకు వంత పాడుతున్నారు. అటవీశాఖాధికారులు, ఇతర సంబంధిత అధికారులు ఈ దోపిడీ వెనుక ఉన్న దళారీల ద్వారా లబ్ధిపొందుతూ వచ్చారు. అంతే కాకుండా గిరిజనుల ఆటోను స్వాధీనం చేసుకుని చలానా కట్టించుకుని, వారి వలలను స్వాధీన పర్చుకుని దళారీ వద్దనే ఉంచి గిరిజనులు వేటాడకుండా చేశారు. ఈ మొత్తం బాగోతం వెనుక ఇటీవల కాలంలో అటవీశాఖలో టేకు చెట్ల నరికివేతతో పాటు పలు అక్రమాలను ప్రోత్సహించిన ఓ ఉన్నతాధికారే ఉండటం ఎవరినీ ఆశ్చర్యపర్చడం లేదు. కాగా ఊహించని రీతిలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం ఈ అక్రమార్కులకు, వారిని ప్రోత్సహించే అధికారులకు మింగుడుపడనిదిగా మారింది. దీంతో కొత్త పాలన, కొత్త అధికారుల రాకతో గిరిజన నిర్వాసితులలో కూడా ఈ అక్రమార్కుల పీడ వదిలిపోతుందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

ఆరు రైళ్లు యథాతథం

రద్దైన రైళ్ల జాబితా నుంచి మినహాయింపు



రాజమహేంద్రవరం,(ఆంధ్రజ్యోతి)/సామర్లకోట, జూన్ 24: కడియం-నిడదవోలు రైల్వే లైన్ల మధ్య మరమ్మతు పనుల నిమిత్తం మొత్తం 26 రైళ్లను సోమవారం నుంచి తాత్కాలికంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడగా ప్రయాణికుల ఆగ్రహంతో రైల్వేశాఖ వెనక్కి తగ్గింది. కొన్ని రైళ్లకు రద్దు జాబితా నుంచి మినహాయింపు ఇచ్చింది. మొత్తం ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నట్లు రైల్వే పీఆర్వో (విజయవాడ) నస్రత్ మండ్రూప్‌కర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

12805 నంబరు గల విశాఖ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ముందుగా చేసిన ప్రకటన మేరకు ఈ నెల 23 నుంచి 10 ఆగస్టు వరకూ, తిరిగి 16 సెప్టెంబరు నుంచి 15 అక్టోబరు వరకూ రద్దు చేయగా సోమవారం రాత్రి అందిన ఉత్తర్వులు మేరకు ఈ నెల 25 మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు. ఇదే రీతిలో రద్దు అయిన 12806 నంబరు గల లింగంపల్లి-విశాఖల మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఈ నెల 26 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని తెలిపారు.

17643 నంబరు గల చెంగల్పట్టు-కాకినాడల మధ్య రాకపోకలు సాగించే సర్కార్ ఎక్స్‌ప్రెస్ గతంలో ప్రకటించిన విధంగా 10 ఆగస్టు వరకూ రద్దు చేయగా తాజాగా అందిన ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుంది. ఇదే రీతిలో 17644 నంబరు గల కాకినాడ-చెంగల్పట్టు మధ్య రాకపోకలు సాగించే సర్కార్ ఎక్స్‌ప్రెస్ కూడా ఈ నెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని పేర్కొన్నారు.

17258 నంబరు గల కాకినాడ-విజయవాడల మధ్య రాకపోకలు సాగించే రైలు ముందుగా ప్రకటించిన మేరకు 15 అక్టోబరు వరకూ రద్దు చేయగా తాజాగా అందిన ఆదేశాల మేరకు మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుంది. అలాగే 17257 నంబరు గల విజయవాడ-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే రైలు కూడా మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని ప్రయాణికులు గమనించాలని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తికి 15 ఏళ్ల జైలు

అమలాపురం టౌన్, జూన్ 24: బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసిన వ్యక్తికి కాకినాడ పోక్సో కోర్టు 15 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 వేలు జరిమానా విధించినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో దళిత బాలికకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో కరెళ్ల గణపతి అనే వ్యక్తి మత్తు పానీయాలు ఇచ్చి బలవంతంగా అనుభవించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్తే చంపేస్తానని బెదిరించాడు. కొద్ది రోజులకే బాలిక గర్భవతి కాగా గుర్తించిన తల్లిదండ్రులు 2018 ఏప్రిల్ 2న గణపతిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఈ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. స్పెషల్ కోర్టు ఫర్ స్పీడీ ట్రయల్ ఆఫ్ అఫెన్సెస్ అండర్ పోక్సో యాక్టు-2012 కాకినాడ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ట్రయల్ నిర్వహించి ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో కరెళ్ల గణపతికి శిక్ష విధిస్తూ జడ్జి కె.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన అప్పటి ఎస్ఐ జి.సురేంద్ర, దర్యాప్తు అధికారి ఎం.వెంకటేశ్వరరావును ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

యువతి తన ప్రేమను అర్థం చేసుకోలేదని యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి, జూన్ 24: తన ప్రేమను అర్థం చేసుకోకుండా తనపై ఓ యువతి తరపున పోలీసు కేసు పెట్టడాన్ని జీర్ణించుకోలేని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి మండలం కొండెవరం శివారు ఇందిరానగర్లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కొత్తపల్లి మండలం కొండెవరం శివారు ఇందిరానగర్‌కు చెందిన బండి చక్రధొర(26) ఓ యువతిని 2021లో ప్రేమించాడు. దీంతో యువతి హైదరాబాద్ వెళ్లిపోయింది. యువతి అక్కడ నుంచి ఇటీవల ఇందిరానగర్ పరీక్షలు రాయడానికి వచ్చింది. మళ్లీ తన కూతురి దగ్గరకు చక్రధొర వస్తాడనే అనుమానంతో యువతి తల్లి కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపం చెందిన చక్రధొర ఇంట్లోనే ఆత్మహత్య చేసుకొన్నాడని పోలీసులు తెలిపారు. యువకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నిషేధిత సిగరెట్ ప్యాకెట్లపై విజి'లెన్స్'

రూ.16.41లక్షల విలువైన ప్యాకెట్లు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న సిగరెట్ ప్యాకెట్లు

అమలాపురం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రధానంగా మూడు దుకాణాలపై దాడులు జరిపి రూ.16,41,530 విలువైన సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సంబంధిత యజమానులపై మూడు కేసులు నమోదు చేసినట్టు రీజనల్ విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. అమలాపురం పట్టణంలోని గొల్లగూడెం బైపాస్ రోడ్డు రామకృష్ణ వీధిలోని ఎంఎస్ నిశిక ఎంటర్‌ప్రైజెస్‌పై తొలుత దాడులు జరిపారు. ఏడు బ్రాండ్లకు సంబంధించి నిషేధిత సిగరెట్లను గుర్తించి రూ.14,33,600 విలువైన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలు చేస్తున్న షాపు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు కోసం అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవుకు చెందిన నున్న వెంకట బుచ్చిరాజు గుంటూరుకు చెందిన వెంకట్ అనే వ్యక్తి నుంచి నిషేధిత సిగరెట్లను సేకరించి తన అల్లుడైన ఎస్వీఆర్ఎస్ఎస్ శోభిత్ ద్వారా ఎంఎస్ నిశిక ఎంటర్‌ప్రైజెస్ వ్యాపార ప్రాంగణంలో ఉంచి రిటైల్ విక్రయాలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. సిగరెట్ ప్యాకెట్లపై చట్టబద్ధమైన వివరాలను ప్రకటించనందున లీగల్ మెట్రాలజీ అధికారులు ఎల్ఎం యాక్టు-2009 కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఎర్రమిల్లి వారి వీధిలోని ఎంఎస్ వరలక్ష్మీ జనరల్ మర్చంట్స్‌ను తనిఖీ చేయగా నిషేధిత సిగరెట్ ప్యాకెట్లయిన హార్బర్ గోల్డ్, గోల్డ్ ఫిల్టర్, గోల్డ్ విమల్ తదితర 2,080 ప్యాకెట్లను గుర్తించారు. వీటి విలువ రూ.1,09,200గా నిర్ధారించారు. షాపు యజమాని జీఎస్టీ సైతం నమోదు చేసుకోలేదు. స్టాకుకు సంబంధించిన ఖాతాల పుస్తకాలు, కొనుగోలు అమ్మకాల బిల్లులు నిర్వహించట్లేదని జీఎస్టీ అధికారులు గుర్తించారు. అనంతరం అదే వీధిలోని శ్రీదేవి జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు జరిపి రూ.1,98,730 విలువైన 3,873 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయా షాపుల యజమానులపై కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు పి.ముత్యాలనాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగవెంకటరాజు, భార్గవమహేష్, లక్ష్మీనారాయణ, నవీన్‌కుమార్, జగన్నాథరెడ్డి, జీవా, లోవరాజు, వలీ, వీరబాబు, కిశోర్ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు

ఈనెల 27 వరకు నిర్వహణ

జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు సమీక్ష

జేఎన్టీయూకేలో ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

జేఎన్టీయూకే, జూన్ 24: ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌సెట్) 2023-24లో రాష్ట్రవ్యాప్తంగా ఈఈఈ,ఈసీఈ విభాగాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు వర్సిటీ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు సోమవారం ప్రారంభమయ్యాయని, ఈనెల 27 వరకూ కొనసాగుతాయని ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ సమావేశ హాల్లో పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో వీసీ పాల్గొని బీఓఎస్ చైర్మన్‌లు, విభాగాధిపతులు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ సభ్యులతో ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వీసీ మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్, రోస్టర్ పాయింట్స్ ప్రాతిపదికన 2023-24 విద్యాసంవత్సరానికిగాను పీహెచ్‌డీ కోసం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈఈఈ విభాగానికి 225 మందికి మూడురోజులపాటు, ఈసీఈ విభాగానికి 364 మందికి నాలుగు రోజుల పాటు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఈఈఈ విభాగానికి సంబంధించి సోమవారం 75 మందికి, ఈసీఈ విభాగానికి సంబంధించి 90 మందికి అడ్మిషన్స్, పరిశోధనాభివృద్ధి డైరెక్టరేట్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ (డీఏఏ) సీహెచ్ సాయిబాబు, ఐక్యూ ఏసీ డైరెక్టర్ ఎన్.బాలాజీ, డీఏపీ వెంకటరెడ్డి, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ పాల్గొన్నారు.

వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడిగా చామర్తి కన్నబాబు




చామర్తి కన్నబాబు, సవితాల వీరబాబు, మెకరాల రాజేష్

అన్నవరం, జూన్ 26: అన్నవరం దేవస్థానం వ్రతపురోహితసంఘ ఎన్నికలు సోమవారం సాయంత్రం రత్నగిరిపై జరగగా కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చామర్తి కన్నబాబు ఎన్నికయ్యారు. సుమారు 30 సంవత్సరాలుగా వ్రత పురోహితుడిగా వివిధ గ్రేడ్‌లలో సేవలందించడంతో పాటుగా ప్రస్తుతం దేవస్థానం కల్యాణబ్రహ్మగాను గతంలో 2017-18 లో వ్రత పురోహిత సంఘ అధ్యక్షుడిగా కన్నబాబు వ్యవహరించారు. 2022-23లో దేవస్థానం వైదిక కమిటీలో పనిచేశారు. కార్యదర్శిగా సవితాల వీరబాబు, కోశాధికారిగా మొకరాల రాజేష్‌ను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వ్రత పురోహితుల సమస్యలు పరిష్కరించడంతో పాటుగా పదవీ విరమణ పొందిన పురోహితులకు, వారి కుటుంబ సభ్యులకు అందించే సౌకర్యాలను సకాలంలో అందేలా చూస్తానని చెప్పారు.



పాదాలమ్మ తల్లి



2 వేల క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు, జూన్ 24: ఖరీఫ్ పంటలు, తాగునీటి అవసరాల కోసం గోదావరి డెల్టాకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏపీ జెన్‌కో ఎస్ఈ కేకేవీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి జెన్‌కో అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారుల అభ్యర్థన మేరకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. అలాగే పవర్ కెనాల్ ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. ఈ మేరకు గోదావరి డెల్టాకు ఆరు వేల క్యూసెక్కుల నీరు వెళుతుందని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 12.5 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ ప్రక్రియను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, జూన్ 24: ఏపీఆర్ సెట్‌లో అర్హత సాధించిన వారికి జియాలజీ, మేనేజ్మెంట్ విభాగాల్లో ప్రవేశాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూ ప్రక్రియను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి జియాలజీ, విభాగంలో 30 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా మేనేజ్మెంట్ విభాగంలో 320 మందికి గాను 80 మందికి జరిగాయన్నారు. మిగిలిన వారికి ఈ నెల 27వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు సెట్ కన్వీనర్ సూచనల ప్రకారం సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో జియాలజీ, మేనేజ్మెంట్ ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు



సామర్లకోట, జూన్ 24: సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామికి సోమవారం పంచద్రవ్యాలతో అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, వెంకన్న, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేక పూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్వామివారికి, అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం నిర్వహించగా ఆలయం వెలుపల భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది భక్తులు అన్నదానం స్వీకరించారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 38 అర్జీలు

వివిధ సమస్యలపై అర్జీలు అందించిన ప్రజలు

త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని పీవో ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఇతర అధికారులు

రంపచోడవరం, జూన్ 24: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టం కార్యక్రమంలో సుమారు 38 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి పీవో అర్జీలను స్వీకరించారు. దేవీపట్నం మండలం తున్నూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, మారేడుమిల్లి మండలం వైదపూడిలో పాఠశాల భవనం నిర్మించాలని, తాడేపల్లి-సద్దిరేవుల వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, పోలవరం ప్రాజెక్టు తొయ్యేరులోని 18 ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, వికలాంగుల పింఛను మంజూరు చేయాలని, నేషనల్ హైవేలో స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ వచ్చిన అర్జీలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించాలన్నారు. ప్రతి అర్జీ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, పశుసంవర్ధకశాఖ డీడీ షరీఫ్, డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, డీఎల్‌పీవో రాఘవన్, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాదాలమ్మ తల్లికి తిరుప్పావడ సేవ

గొల్లప్రోలు, జూన్ 24: కాకినాడ జిల్లా గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్ద కొలువయి ఉన్న పాదాలమ్మ తల్లికి సోమవారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. గ్రామదేవతా విరాజిల్లుతున్న పాదాలమ్మ వారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ సేవ జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఏజెన్సీ సమాచారం

వెలుగు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



ఐటీడీఏ పీవోతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రంపచోడవరం, జూన్ 24: ఏజెన్సీలో డ్వాక్రా రుణాల మంజూరులో అవినీతికి పాల్పడిన వెలుగు సీసీలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు సీసీల సపోర్టు చేస్తున్న ఏపీడీపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఐటీడీఏ ఏపీవో, వెలుగు ఏపీడీ వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఆందోళన విరమించలేదు. సాయంత్రం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే వచ్చి సమగ్ర నివేదిక రూపొందించాలని ఏపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు లోత రామారావు, మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, కె.శాంతిరాజు, మండల సమాఖ్య లీడర్లు సంకురమ్మ, పోసమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషాదేవి విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి

రాజవొమ్మంగి జూన్ 24: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి రంపచోడవరం వస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మరం విజయభాస్కర్ తెలిపారు. బుధవారం ఉదయం రంపచోడవరం మండలంలోని సీతపల్లి బాపనమ్మతల్లి ఆలయం వద్ద నుంచి రాజవొమ్మంగి మండలం వరకు విజయోత్సవ ర్యాలీ జరగనుందని చెప్పారు. రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో విజయోత్సవ ర్యాలీ జరగనుందని, గంగవరం మండలంలోని అడ్డపల్లి గ్రామంలో భోజన ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా శిరీషాదేవి విజయానికి కృషి చేసిన 11 మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి



ఐటీడీఏ పీవోతో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నేతలు

రంపచోడవరం, జూన్ 24: ఏజెన్సీ ప్రాంత రైతులు, కౌలు రైతులకు సబ్సిడీతో కూడిన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకుడు బచ్చెల బొజ్జిరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను కలిసి వినతిపత్రం అందజేశారు. కొండపోడు రైతులకు వీలుగా అన్ని రైతు భరోసా కేంద్రాలలో చామలు, కొర్రలు, రాగులు, జొన్నలు, మొక్కజొన్నలు తదితర విత్తనాలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల సాయాన్ని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలన్నారు.

ముళ్ల చెట్లను తొలగించాలి



వరరామచంద్రాపురం, జూన్ 24: ఇటీవల గాలి, వాన బీభత్సానికి వీఆర్‌పురం, రేఖపల్లి ప్రధాన రహదారిపై పడి ఉన్న తుమ్మ చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ద్విచక్ర వాహనదారులకు సైకిలిస్టులకు రోడ్డుపై తుమ్మచెట్లు ఉండడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డుపై పడిఉన్న ముళ్లకంప తగలడంతో గాయాలపాలయ్యాడు. ఇప్పటికైనా అధికారులు తుమ్మ చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ



మోతుగూడెంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

మోతుగూడెం, జూన్ 24: మోతుగూడెం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్‌ను సోమవారం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, సర్పంచ్ ఆకేటి సీత అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పరిమళ దేవుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే మోతుగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శాంసన, ఉపాధ్యాయులు పి.సన్యాసిరావు, ఎం.కవిత, ఎం.సుజాత, అనూరాధ, టి.రాజేశ్వరి పాల్గొన్నారు.

టేకులబోరు పాఠశాలలో

కూనవరం, జూన్ 24: మండలంలోని టేకులబోరు యూపీఎస్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విలీన మండలాల్లో కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యా ప్రమాణాలు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో చెలకాని ఉమామహేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమంత్, జనసేన మండలాధ్యక్షుడు దాసరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేఖపల్లిలో

వరరామచంద్రపురం, జూన్ 24: రేఖపల్లిలోని కస్తూరి, మినీ గురుకులంలోని విద్యార్థులకు సోమవారం రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలన్నారు. అనంతరం ఆమె రూ.96 లక్షలతో నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న వంటకాలను పరిశీలించారు. పనులు ప్రారంభించిన ఏడాదిన్నర కావస్తున్నా అసంపూర్తిగానే ఉందని ఇప్పటికైనా విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ లోపాలు బయటకు తీస్తాం

▸ మహిళా సంఘాల ప్రతినిధులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 24: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా ఏమి జరిగిందో తవ్వే ఆలోచన తమకు లేదని కాని వారి లోపాలు మాత్ర చూపించి తీరుతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం మహిళా సంఘాల ప్రతినిధులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలు వస్తాయని, ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఆరోగ్యకర రాజమండ్రి కార్యక్రమంలో భాగంగా అధ్వానంగా ఉన్న పారిశుధ్యం ప్రక్షాళన చేశామన్నారు. గత పాలకులు ఎంత దారుణంగా వ్యవహరించారో గుర్తుచేశారు. గోదావరి గట్టు మీద వర్షం నీరు ఒక లెవెల్ దాటాక గోదావరిలోకి మళ్లించేలా వాల్వ్ తిప్పాల్సి ఉన్నప్పటికి గత ఐదేళ్లు అసలు వాల్వ్ తిప్పిన దాఖలాలు లేవన్నారు. తాను నెగ్గాక అక్కడ పరిస్థితి చూస్తే వాల్వ్ నుంచి గోదావరిలోకి వెళ్లే చానల్ అంతా చెత్తతో నిండిపోయిందని అదంతా తీయడానికి ఐదు రోజులు పట్టిందన్నారు. వాల్వ్ కూడా తిరగకపోతే కొత్తగా వేశామన్నారు. ఐదేళ్లుగా జగన్ ఏమేమి తప్పులు చేశారో వాటిని ప్రజలకు చూపిస్తామన్నారు. తెలిసి చేసిన తప్పులకు కూటమి సూచనల మేరకు చర్యలు ఉంటాయన్నారు. రాజమహేంద్రవరంలో హేవలాక్ బ్రిడ్జి, మల్టీపర్పస్ స్టేడియం మేచింగ్ గ్రాంట్‌కు సంబంధించిన ఫైళ్లను పట్టుకుని ఎంపీ పురందేశ్వరి ఢిల్లీ వెళ్లారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు సత్కరించారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, బీజేపీ నగర కోఆర్డినేటర్ యెనుముల రంగబాబు, వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, బుడ్డిగ రాధ, మజ్జి రాంబాబు, కోరుమిల్లి విజయశేఖర్, కడలి రామకృష్ణ, కిలపర్తి శ్రీనివాస్, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి పాల్గొన్నారు.

అనపర్తిలో ఆలయాల అభివృద్ధికి కృషి

▸ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూన్ 24: నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన అనేక ఆలయాలను పునర్నిర్మించుకోవాలని, బిక్కవోలులో చారిత్రక ఆలయాలైన గోలింగేశ్వర స్వామి, లక్ష్మీగణపతి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలో రామవరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గిరిడా గంగాభవాని అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గ్రామంలోని శివాలయ పునర్నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ రామవరం శివాలయ పునర్నిర్మాణానికి పారిశ్రామికవేత్త మేడపాటి రామలింగారెడ్డి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే రామవరం-రాయవరం రోడ్డును అధికారులతో కలిసి ఎమ్మెల్యే నల్లమిల్లి పరిశీలించారు. ఇటీవల ఈ రోడ్డు తక్షణ మరమ్మతులకు కలెక్టర్ రూ.1.50లక్షల నిధులు మంజూరు చేశారని వాటితో రోడ్డును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని అధికారులను కోరారు. సామర్లకోట-వేమగిరి రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమాల్లో పీఆర్ డిఈ వెంకటరామారెడ్డి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, తేనెల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన రామకృష్ణారెడ్డికి అనపర్తి శివారు కొత్తూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మందపల్లి చరణ్ ఎమ్మెల్యే చిత్రాన్ని రంగులతో రూపొందించి ఆయన నివాసంలో నల్లమిల్లికి అందజేశాడు. ఈ సందర్భంగా చరణ్‌ను ఎమ్మెల్యే అభినందించారు.



రామవరం-రాయవరం పుంత రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించాలి

▸ సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య



సీతానగరంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

సీతానగరం, జూన్ 24: ఐదేళ్లలోపు పిల్లల్లో నీళ్ల విరేచనాల కారణంగా ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని, ప్రభుత్వం జూలై 1నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రారంభించి డయేరియా వ్యాధి వల్ల వచ్చే నష్టాలు, నివారణా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ కేవీకే చైతన్య అన్నారు. స్టాప్ డయేరియా కాంపైన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులు, చెత్తా చెదారం వల్ల ఈగలు వృద్ధి చెంది విరేచనాలు, కడుపునొప్పి, కామెర్లు వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. వర్షాలు కురవడం ప్రారంభమైనందున గ్రామాల్లోని ఇంటి పరిసరాలు, వీధులు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.రాజు, మేఘన, సీహెచ్‌వో వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, సూపర్‌వైజర్లు సుధాకర్‌రావు, డి.దైవకృప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రంగంపేట, జూన్ 24: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈవోపీఆర్డీ పి.వెంకటరత్నం మాట్లాడారు. "ర్షాకాలం ప్రారంభమై సీజనల్ అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు, జీఎల్‌ఆర్‌లు,చేతి పంపులు వెంటనే అవసరమైన రిపేర్లు చేయించి ప్రతి రోజూ నీటిని క్లోరినేట్ చేసి సరఫరా చేయాలన్నారు. అంటువ్యాధుల ప్రబల కుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తుపాన్లు, అధిక వర్షాలు కురిసే సమయాల్లో గ్రామాల్లో చేపలు, మాంసం అమ్మకాలను పూర్తి నిషేధించాలన్నారు. బ్లీచింగ్ చల్లించి పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.

ట్రాన్స్‌జెండర్లపై వివక్ష చూపరాదు

డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష చూపరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సమస్యలపై డీఎల్ఎస్‌ఏలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రకాశ్‌బాబు మాట్లా డుతూ స్త్రీ, పురుషులకు సమంగా ట్రాన్స్‌జెండర్లకు హక్కులు ఉన్నాయ న్నారు. వాటిని వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. ట్రాన్స్‌జెం డర్లకు స్వయం ఉపాధి అవకాశాలు, సబ్సిడీలు తదితర విషయాలు వివరించారు.

అనుమతి లేకుండా ఆహారం విక్రయం

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు

రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా క్యాటరింగ్ సర్వీసు పేరుతో రైళ్లలోని ప్రయాణికులకు ఆహారం అందజేస్తున్న వారిని రైల్వే కమర్షియల్ విభాగంలోని క్యాటరింగ్ బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ డివిజన్‌లో వాట్సప్ ద్వారా ఆర్డర్లు స్వీకరించి ప్రయాణికులకు ఆహారం అందజేస్తుండడం తమ దృష్టికి వచ్చిందని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో స్ట్రింగ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఆన్‌లైన్‌లో తమ అధికారులు ఆర్డర్ చేశారన్నారు. దాని ప్రకారం రైలు నెం.12717 రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కి రాజమండ్రిలో ఫుడ్ తీసుకొచ్చిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించామని చెప్పారు. వారిపై రైల్వే యాక్టు-1989లోని సెక్షన్ 144(1) ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

బిక్కవోలు ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

బిక్కవోలు, జూన్ 24: బిక్కవోలు వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌చౌదరి, కార్యదర్శిగా రఘు, కోశాధికారిగా బులిస్వామిరెడ్డి, సహ కోశాధికారిగా పోలరాజులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు అభినందించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం, జూన్ 24: మండలంలోని వీరలంకపల్లిలో అంబేడ్కర్ గురు కుల బాలికల పాఠశాలలో 6నుంచి 9వ తరగతి వరకు ప్రవేశానికి దరఖా స్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎంవీ రాణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 25 నాటికి విద్యార్థులు తమ దరఖాస్తులను అందజేయాలని, 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామ న్నారు. పూర్తి వివరాల కోసం 9441102187కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సినీ నిర్మాతల సమావేశంలో మంత్రి దుర్గేష్



నిడదవోలు, జూన్ 24: అమరావతి సచివాలయంలో సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలసి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటో గ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలుగు సినీ నిర్మాతల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమలోని సమస్యలు, రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధిపై చర్చ జరిగిందని, సినీ పరిశ్రమకు అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని దుర్గేష్ తెలిపారు.

యనమలను కలిసిన టీడీపీ నాయకులు



కోరుకొండ, జూన్ 24: మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును సోమవారం ఆ పార్టీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి ఆధ్వర్యంలో పలువురు సీనియర్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తుని ఎమ్మెల్యే యనమల దివ్యను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. తదుపరి వారు యనమల రామకృష్ణుడుతో కలిసి సమావేశమయ్యారు. నియోజకవర్గంలో టీడీపీ విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా బీవీఆర్ వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కంటే నాగ కేశవరావు, తనకాల నాగేశ్వరరావు, గంగిశెట్టి సత్తిబాబు, అడపా వీరబాబు, పలువురు టీడీపీ సీనియర్ నాయకులు ఉన్నారు.

జనసైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బిక్కవోలు, జూన్ 24: ఇటీవల బిక్కవోలు గ్రామానికి చెందిన జనసైనికుడు పాలిక అశోక్ కుమారుడు వరణ్‌తేజ్ (9) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో నియోజకవర్గ జనసైనికులు సమకూర్చిన రూ.50 వేలను సోమవారం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త రావాడ నాగు, మండలాధ్యక్షుడు ఇందల వీరబాబు, కామాకు అరుణ్‌కుమార్, గుత్తుల శివకొండబాబు, తోట సతీష్, నూతంగి శ్రీను, వడ్లమూరి గోవింద్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

అవగాహన సదస్సులో సీడీపీవో ఝాన్సీరాణి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో ఝాన్సీరాణి

గోకవరం, జూన్ 24: మానవ అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యతని సీడీపీవో ఝాన్సీరాణి అన్నారు. గోకవరంలోని మండల సమాఖ్య సమావేశ హాల్లో సోమవారం హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన సదుస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో ప్రతి రోజు ఎంతోమంది యువతులు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ వరలక్ష్మి మాట్లాడుతూ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల సంస్థ 28 ఏళ్లుగా పోరాడుతూ ఇప్పటివరకు 28,200మంది యువతులు, మహిళలను కాపాడి వారికి పునరావసం కల్పించిందని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ వచ్చినపుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రమాదానికి గురైన సందర్భంలో 1930 టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించాలని వరలక్ష్మి వివరించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు లఘు చిత్రాల ద్వారా అవగాహన కలిగించారు.

నాక్ పర్యటన విజయవంతం చేయాలి

సీతానగరం, జూన్ 24: ఈ నెల 27, 28 తేదీల్లో సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగనున్న నాక్ కమిటీ పర్యటనను విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ డి.చిట్టిబాబు కోరారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ పర్యటనలో కళాశాలల్లో ఉన్న సౌకర్యాలు, సదుపాయాలు, పరిశీలించి కళాశాలకు గ్రేడ్‌లను కేటాయిస్తారన్నారు. అలాగే చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అలాగే కళాశాల అభివృద్ధి కమిటీతో సమావేశం ఉంటుందని, ఈ కార్యక్రమంలో ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు తప్పక పాల్గొనాలని కోరారు.

చట్టప్రకారమే ప్రభుత్వ చర్యలు : గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 24 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చట్ట ప్రకారమే చేపడుతున్న చర్యలు చేపడుతుందని.. ఎటువంటి కక్షసాధింపులు లేవని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ కార్యాలయాలు చూస్తుంటే ప్యాలెస్‌ల్లా ఉన్నాయన్నారు. పార్టీ కార్యాలయాలు కట్టుకోవడం తప్పుకాదు కానీ ఎటువంటి అనుమతులు లేకుండా వారి జేబు సంస్థతో నిర్మింపజేసుకున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకుడు మళ్ల వెంకట్రాజు పాల్గొన్నారు.

పుల్లా, కొత్తూరి కుటుంబాలకు పరామర్శ

కడియం, జూన్ 24: ఇటీవల మాతృ వియోగం పొందిన పుల్లా రామారావును, కొత్తూరి బాలనాగేశ్వరరావు-కృష్ణ సోదరులను సోమవారం టీడీపీ నాయకుడు గన్ని కృష్ణ వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమాల్లో గంగిన హనుమంతరావు, ఆళ్ల ఆనందరావు, మత్యేటి ప్రసాద్, పందూరి అప్పారావు, పిన్నింటి ఏకబాబు, ధర్మరాజు, రాయుడు సతీష్, గిరజాల శ్రీను, ధర్మరాజు, పలువురు నర్సరీరైతులు పాల్గొన్నారు.

యువతలో నైతిక విలువల పెంపునకు కృషి

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 24: యువత వ్యసనాలకు బానిసలు కాకుండా నైతిక విలువలు పెంపొందించేందుకు స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఐవో) పలు కార్యక్రమాలు చేపడుతోందని సంస్థ రాష్ట్ర సలహామండలి సభ్యుడు జాఫర్ షరీఫ్‌నగర అధ్యక్షుడు ఆసిఫ్ అహ్మద్ అన్నారు. నెహ్రూనగర్ బిలాల్ మసీదులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువత, లక్ష్యరహిత జీవితంతో నైతిక పతనానికి లోనై, ఉన్నతమైన జీవిత లక్ష్యాలను విస్మరిస్తున్నారన్నారు. ఇటువంటి యువతలో మానసిక స్థైర్యం నింపడానికి సామాజిక అభివృద్ధి పేరుతో జూలై 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. రాజమండ్రి శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నగర కార్యదర్శి అమాన్, మీడియా కార్యదర్శి ఉమర్ పాల్గొన్నారు.

28న ఆర్టీసీ అన్‌ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24: రాజమహేంద్రవరం ఆర్టీసీ పార్శిల్ ఆఫీస్‌లో అన్ ఐడెంటిఫైడ్/అన్ క్లైయిమ్డ్ పార్శిల్స్‌ను ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ కార్గో ఏటీఎం కె.మాధవ్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరం బస్టాండ్ ఆవరణలోని పార్శిల్ ఆఫీసు వద్ద వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు పాల్గొనవచ్చని కోరారు.

'ఆర్ట్స్' అధ్యాపకులకు 5 పరిశోధన ప్రాజెక్టులు



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులకు రూస 2.0 పథకం కింద రూ.24 లక్షల విలువైన ఐదు పరిశోధన ప్రాజెక్టులను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రూసా విభాగం ప్రకటించింది. కళాశాల ప్రిన్సిపాల్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు రామచంద్ర ఆర్‌కేకు రూ.10 లక్షలు, భూగర్భశాస్త్ర అధ్యాపకుడు ఎంఆర్ గౌతమ్‌కు రూ.5 లక్షలు, వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడు బీవీ నర్సారెడ్డికి రూ.3 లక్షలు, అర్థశాస్త్ర అధ్యాపకుడు డీవీ నాగేశ్వరరావుకు రూ.3 లక్షలు, సీతామహాలక్ష్మి కస్తూరికి రూ.3 లక్షలు కేటాయించినట్టు ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. అవకాశాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకుని భావి తరాలకు ఆదర్శమైన పరిశోధనలు, గొప్ప ఫలితాలను అందించాలని కోరారు.

పూర్వ విద్యార్థులకు పర్మినెంట్ ఐడీ నెంబర్స్

రాజమహేంద్రవరం సిటీ,జూన్ 24: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ, పీజీ పూర్తి చేసుకున్న ప్రతి పూర్వ విద్యార్థికి పర్మినెంట్ ఐడీ నెంబరు ఇచ్చినట్టు ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్ తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సోమవారం కళాశాల పూర్వ విద్యార్థులకు ఐడీలను అందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ భార్గవ్, గడ్డే సుధాకర్, ఎస్.విజయలక్ష్మి, జి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

కన్నమాంబ జాతరను ప్రశాంతంగా జరుపుకోండి

రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఆల్కట్ తోటలో రామాలయం కమిటీ శెట్టిబలిజ సంఘం మంగళవారం నిర్వహిస్తున్న కన్నమాంబ జాతర సందర్భంగా ఆలయ పెద్దలతో సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ సమావేశమయ్యారు. ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు, అల్లర్లకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జాతర జరుపుకోవాలన్నారు.మెయిన్ రోడ్డుపై ఊరేగింపు వెళ్లే సమయంలో ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించవద్దన్నారు. జాతరలో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాలువల్లో పూడిక తీతలు వేగవంతం చేయండి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 24: వర్షాలు ప్రారంభమవుతున్న తరుణంలో రాజమహేంద్రవరంలోని కాలువల్లో పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మోరంపూడి, వెంకటేశ్వర మార్కెట్, ఎస్‌వీజీ మార్కెట్ గుండా ప్రవహించే కాలువల్లో పూడిక తీత పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పిడింగొయ్యి గ్రామ పరిధిలోనూ డ్రైనేజీలు పూడిత తీత తీయించాలని పంచాయతీ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వినూత్న, పిడింగొయ్యి సెక్రటరీ రూప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల గవర్నర్ పదవికి సమర్థుడు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 24: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గవర్నర్ పదవికి సమర్థుడని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ సైనిక సెల్ చైర్మన్ నున్న మోహన్‌రావు చౌదరి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

ప్రఖ్యాత నేత్రవైద్య నిపుణుడు డాక్టర్ రాజు

రాజానగరం, జూన్ 24: మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎన్‌ఆర్‌ఐ ప్రఖ్యాత నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ వాడ్రేవు కె.రాజు అన్నారు. జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు అధ్యక్షతన సోమవారం జీజీయూలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మహిళలు సర్వతోముఖాభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని చెప్పారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులపట్ల గౌరవ, మర్యాదలతో నడచుకోవాలని యువతకు ఉద్బోధించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. చైతన్యరాజు మాట్లాడుతూ పిల్లల్లో అంధత్వాన్ని నివారించేందుకు అంకితభావంతో ప్రపంచవ్యాప్తంగా మానవాళికి నిస్వార్థసేవలు అందిస్తున్న మహోన్నత వ్యక్తి డాక్టర్ రాజు అని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి డాక్టర్ యు.చంద్రశేఖర్, గైట్ డైరెక్టర్లు టీవీ ప్రసాద్, ఆర్.ఎస్.రాజు, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు, అటానమస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లీలావతి, ప్రముఖ న్యాయవాది శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ముగ్గురు ఎంపీలు ప్రమాణం

తెలుగులో పురందేశ్వరి.. ఇంగ్లీష్‌లో హరీశ్, ఉదయ్



దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం



గంటి హరీష్ మాధుర్ బాలయోగి, అమలాపురం



తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ

రాజమహేంద్రవరం అర్బన్/అమలాపురం/కార్పొరేషన్(కాకినాడ), జూన్ 24 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎన్నికైన ముగ్గురు కూటమి పార్లమెంట్ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు.ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రమాణస్వీకారం చేయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీగా ఎన్నికైన దగ్గుబాటి పురందేశ్వరి అనే నేను అంటూ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ ముగించారు. అమలాపురం రిజర్వు లోక్‌సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన గంటి హరీష్‌బాలయోగి ఆంగ్లంలో ప్రమాణపత్రాన్ని చదివారు. ప్రమాణ స్వీకారం అనంతరం హరీష్ ప్రొటెం స్పీకర్‌ను కలిశారు. పార్లమెంటులో టీడీపీ విప్‌గా ఇప్పటికే నియమితులైన హరీష్ చాంబర్‌లో కొలువుదీరారు. కాకినాడ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఇంగ్లీష్‌లో ప్రమాణ పత్రాన్ని చదివారు. తొలిసారి ఎంపీలుగా గంటి హరీష్ మాధుర్, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికవడం గమనార్హం. రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎంపీ పురందేశ్వరి తెలి పారు.టీడీపీ ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన కోనసీమ జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తానన్నారు.కాకినాడ ఎంపీ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ అభివృద్ధికి తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. భవిష్యత్‌లో కాకినాడ సరికొత్త అభివృద్ధి పథకాలతో వెలుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్‌గా 26 నెలలు పనిచేశా..

రిలీవ్ అయిన మాధవీలత..జేసీకి బాధ్యతలు అప్పగింత

రేపు కొత్త కలెక్టర్ ప్రశాంతి బాధ్యతల స్వీకరణ



జిల్లాలో కలెక్టర్ మాధవీలత చివరి సంతకం

రాజమహేంద్రవరం,జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్‌గా డా.కె.మాధవీలత సోమవారం తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఇటీవల కొత్త ప్రభుత్వం మాధవీలతను బదిలీ చేసి జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో పి.ప్రశాంతిని నియమించారు. కొత్త కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. ఈలోపు కలెక్టర్ మాధవీలత బాధ్యతల నుంచి తప్పుకుని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌కు అప్పగించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినూత్నంగా చిన్నారుల ఆరోగ్యం కోసం అమలు చేసిన బంగారు కొండ పథకం తనకు మధురానుభూతిని కలిగించిందన్నారు.తూర్పుగోదావరి జిల్లా తొలి కలెక్టర్‌గా 2022 ఏప్రిల్ 4న బాధ్యతలు తీసుకున్నానని..26 నెలలు జిల్లాలో సేవలందించానన్నారు. కలెక్టర్‌గా విధి నిర్వహణ ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.

అమలు ఐదు..

బాబు చెప్పారు..చేస్తున్నారు..



తొలి కేబినెట్ భేటీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

హామీల అమలెప్పుడు.. ఎలా చేస్తారు.. ఏం చేస్తారు.. కూటమి అధికారం చేపట్టి 20 రోజులైందో లేదో.. ఇదీ వైసీపీ నాయకుల తీరు.. నిన్నటి వరకూ అధికారంలో ఉన్నా పాలన అంటే ఏంటో తెలియనట్టు మాట్లాడుతున్నారు. అయితే చంద్రబాబు మాత్రం తగ్గేదేలే అంటున్నారు.. అనుకున్న సమయానికి అన్ని హామీలు అమలు చేసేలా కార్యరంగంలో దూకుడుగా పోతున్నారు.. చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలంటే చాలా కష్టమనేది వైసీపీ నాయకుల వాదన.. అయితే అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం తానేంటో నిరూపించుకునే పనిలో పడ్డారు.దీనిలో భాగంగా సోమవారం నిర్వహించిన తొలి మంత్రివర్గ భేటిలోనే ఐదు ప్రాధాన్యత అంశాలకు ఆమోదం తెలిపారు.

ఉమ్మడి జిల్లాగా డీఎస్సీ

మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ తొలిసంతకం చేశారు. ఆగస్టు నుంచే దరఖాస్తులు స్వీకరించి డిసెంబర్‌లోపు పోస్టింగ్‌లు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నారు.కొత్త జిల్లాలు ఏర్పడినా డీఎస్సీ పాత జిల్లాల వారీగా నిర్వహించనున్నట్టు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాల వారీ లెక్కలే వేస్తున్నారు. కొత్త తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రి డివిజన్ పరిధిలోని వారికి కాకినాడ జిల్లా విద్యాధికారి, కొవ్వూరు డివిజన్‌కు ఏలూరు జిల్లా విద్యాధికారి డీఎస్సీ నిర్వహిస్తారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న కొత్త తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారులు ఇంత వరకూ జిల్లాలో ఎన్ని ఖాళీలు ఉన్నాయి..ఏ ఏ సబ్జెక్టులు ఉన్నాయో కూడా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. కానీ మెగా డీఎస్సీ నిర్వ హణ నిర్ణయంపై నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు..

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందపడుతున్నారు. వైసీపీ తెచ్చిన ఈ చట్టం వల్ల తమ భూములన్నీ ఆక్రమణలకు గురవుతాయని, పెద్దలదే పెత్తనం అవుతుందని భయపడిన సంగతి తెలిసిందే. వైసీపీ ఓడిపోయిన తర్వాత బయటకు వస్తున్న వారి ప్యాలెస్‌ల వ్యవహారం చూస్తుంటే ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వెనుక పెద్ద కుట్ర ఉండేమోననే చర్చ కూడా జరుగుతోంది. కానీ ఎన్నికల ముందు చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేయడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఆనందపడుతున్నారు. భూములకు ఇబ్బందిలేదని అంటున్నారు.

ఆగస్టు నుంచి అన్న క్యాంటీన్లు

ఇక అన్న క్యాంటీన్ల పునరుద్ధరించాలని కూడా కేబినెట్ ఆమోదించింది. ఆగస్టు 15వ తేదీ నుంచి ఒకేసారి అమల్లోకి తేవాలని యోచిస్తున్నట్టు సమాచారం. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదల కోసం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో రాజమహేంద్రవరంలో రెండు, నిడదవోలులో ఒకటి, కొవ్వూరులో ఒకటి ఉన్నాయి. ఆసుపత్రుల వద్ద, ప్రముఖ కూడళ్లలో క్యాంటీన్లను ఏర్పాటు చేసి రూ.5లకే భోజనం పెట్టేవారు. 2019లో జగన్ సీఎంకాగానే వీటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. వీటిని తెరవనున్నారు.

- తొలి కేబినెట్ భేటీలోనే చర్చ
- ఐదు హామీలకు ఆమోద ముద్ర
- పింఛన్ వచ్చే నెల రూ.7 వేలు
- ఆ తరువాత నుంచి రూ.4 వేలు
- జిల్లాలో 2.42 లక్షల పింఛన్లు
- డీఎస్సీ ఫైలుపైనా సంతకం
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు
- అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సిగ్నల్
- నైపుణ్య గణనకు ప్రణాళిక
- పరిశ్రమల వారీగా అధికారుల లెక్క

1న ఇంటికే పింఛన్..

జూలై 1వ తేదీన పింఛన్ సొమ్ము రూ..7వేలు వస్తుంది. అది ఇంటికి తెచ్చే ఇస్తారు. ఆగస్టు నుంచి ప్రతి నెలా రూ.4 వేల వంతున ఇస్తారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రూ.3 వేలుగా ఉన్న పింఛన్‌ను రూ.4 వేలుకు పెంచడంతో పాటు దానిని ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని చెప్పారు.ఈ పింఛన్ పథకానికి ఎన్టీఆర్ భరోసా అని పేరు పెట్టారు.ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.3 వేలు చొప్పున మాత్రమే పింఛన్ ఇచ్చారు. చంద్రబాబు ఏప్రిల్ లో తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో ఇచ్చిన హామీ మేర కు మరో వెయ్యి కలిపి మూడు నెలలకు మూడు వేలు.. జూలై నెల పింఛన్ రూ.4 వేలు.. మొత్తం రూ.7 వేలను జూలై1న ఒక్కో పింఛన్‌దారుడికి ఇస్తారు. సచివాల య ఉద్యోగులు ఇంటింటికి ఇచ్చేలా ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పింఛనుదారులు ఆనందంలో మునిగిపోయారు. రూ.3 వేలు ఇచ్చేవారికి రూ.4 వేలు చేయడంతో పాటు, దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, రూ.15 వేలు కూడా చేయడం గమనార్హం. ఇక జిల్లాలో నెలకు పింఛన్ సొమ్ము రూ.102 కోట్లు అవుతుంది. జిల్లాలో ఒక్కో పింఛనుదారుడికి నెలకు రూ.4 వేలు, దివ్యాంగ పింఛన్ రూ.6 వేలు చేయడం వల్ల సుమారు నెలకు రూ.30 కోట్లు అదనంగా అవసరమవుతుందని అంచనా వేస్తుంది. జిల్లాలో మొత్తం 18 రకాల పింఛను లబ్ధిదారులు 2,42,300 మంది ఉన్నారు.

నైపుణ్య గణన

కొత్తగా చంద్రబాబు నైపుణ్య గణన అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.దీనికి కూడా కేబినెట్ ఆమోదించింది. ప్రతి ఇంటా సర్వే చేస్తారు. ఎవరికి ఏ నైపుణ్యం ఉందో వివరాలు సేకరించి తదనుకుణంగా కొన్ని మేలు చేసే నిర్ణయాలు అమలు చేయనున్నారు. ఈ పథకం కూడా అన్ని వర్గాలకు మేలు చేయనుంది. దీనిపై ఒక ట్రెండు రోజుల్లో పూర్తి స్థాయి గైడ్‌లైన్స్ రానున్నాయి. ప్రస్తుతం నైపుణ్య అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం ఓ బాధ్యత అప్పగించింది. జిల్లాలోని అన్ని పరిశ్రమలను పరిశీలించి, అక్కడ ఎంత మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.ఎంత జీతం ఇస్తున్నారు.అసలు అక్కడ ఎంత మంది ఉద్యోగులు ఉండాలి అనే వివరాలను సేకరించమని ఆదేశించింది. అధికారులు రంగంలోకి దిగారు.



రాజమహేంద్రవరం బస్టాండ్‌లో విజయవాడ బస్ వద్ద ప్రయాణికుల క్యూ

రైళ్ల రద్దు.. బస్‌లకు డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24 : రైల్వే ట్రాక్ ఆధునీకరణ పనుల నిమిత్తం విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే 24 రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేయడంతో ఆర్టీసీ బస్సులకు డిమాండ్ పెరిగింది. దీంతో విజయవాడ, విశాఖపట్నం రూట్లలో నడిచే షెడ్యూలు ఆర్టీసీ సర్వీసులకు ప్రయాణికుల రద్దీ పెరగనుంది. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రతిరోజూ ఈ రెండు రూట్లలోనూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల నిమిత్తం ఉదయం వెళ్లి రాత్రికల్లా తిరిగి వచ్చేస్తుంటారు. గతంలో వీరంతా రైళ్లలో ప్రయాణించేవారు. అయితే ప్రస్తుతం రైళ్ల రద్దుతో బస్‌లకు డిమాండ్ పెరగనుంది. ఇదే డిమాండ్ విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే రైళ్లకు కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో ఈ రెండు ప్రధాన నగరాల మధ్య డైలీ నడిచే రత్నాచల్, జన్మభూమి వంటి కొన్ని ప్రధాన రైళ్లను దాదాపు నెలన్నరపాటు రద్దు చేయడం ఆర్టీసీకి వరంగా పరిణమించనుంది. రాజమహేంద్రవరం డిపో నుంచి ప్రతిరోజూ మొత్తం 14 సూపర్‌డీలక్స్ సర్వీసులు షెడ్యూలు సర్వీసులుగా విజయవాడ వెళ్లి వస్తుంటాయి. కొవ్వూరు డిపో నుంచి ఒకటి నడుపుతున్నారు. ప్రతిరోజూ హైదరాబాద్‌కు వయా విజయవాడ మరో నాలుగు బస్సులు వెళుతుంటాయి. మరోపక్క విశాఖపట్నం, ఇచ్ఛాపురం రూటులో డైలీ 17 సర్వీసులు నడుపుతున్నారు. రైళ్లు రద్దు కావడంతో చాలా మంది ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఆశ్రయించక తప్పనిసరి పరిస్థితి నెలకొంది. దాదాపుగా ప్రైవేట్ ట్రావెల్స్ అన్నీ సాయంత్రం, రాత్రి మాత్రమే నడుస్తాయి. పగటిపూట విజయవాడ,విశాఖపట్నం వెళ్లాలంటే ఆర్టీసీ సర్వీసులే ప్రధాన ఆధారం. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్టీసీ అధికారులు ఈ అవకాశాన్ని ఎంత మేర సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంచుకుంటారనేది చూడాలి.

డయేరియా నియంత్రణకు రెండు నెలల కార్యాచరణ

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకూడదనే లక్ష్యంతో వైద్య, ఆరోగ్యశాఖ జిల్లాస్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి సమాయత్తమవుతోంది. రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ రెండు నెలలపాటు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని నిర్ణయించారు. వైద్య సిబ్బంది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందిస్తారు. డయేరియా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్గిస్తారు. శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, శుద్ధమైన తాగునీరు వంటి వాటితోపాటు అనుబంధశాఖలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, గ్రామీణ నీటి యాజమాన్యసంస్థ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను కూడా సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచడం జరిగిందని, పట్టణ ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపయిన్ చేపట్టడానికి సమన్వయశాఖల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రయాణికులను ఇబ్బంది పెట్టొద్దు

రైల్వేకు ఎమ్మెల్యే వాసు విజ్ఞప్తి

రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): కడియం-నిడదవోలు మధ్య మరమ్మతులకు 22 రైళ్ల తాత్కాలికంగా రద్దు చేసిన కారణంగా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేశారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ నుంచి వేలాది మంది రాకపోకలు సాగిస్తారన్నారు. రత్నాచల్, జన్మభూమికి రద్దీ ఎక్కువగా ఉంటుందని గుర్తు చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల దిశగా రైల్వే ఆలోచన చేయాలన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రైళ్ల రద్దు వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ డీఎంకి సూచించామన్నారు. డిమాండ్ మేరకు సర్వీసులను పెంచాలన్నారు. ఎంపీ పురందేశ్వరి ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత మళ్లీ సమీక్ష చేస్తామన్నారని తెలిపారు. ఎవరికైనా ఇబ్బందులుంటే తెలియజేస్తే వాటి ఆధారంగా తగు చర్యలు తీసుకోడా నికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సమస్య మీది.. పరిష్కారం మాది..



కలెక్టరేట్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ మాధవీలత

కూటమి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూన్ 24 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత మార్చి నెలలో నిలిచిపోయిన స్పందన కార్యక్రమం ప్రభుత్వం మారడంతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్)గా మళ్లీ ప్రజలముందు కొచ్చింది. సుమారు మూడు నెలల పాటు కార్యక్రమం నిలిచిపోయింది. ప్రభుత్వం మారడంతో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నూతన ప్రభుత్వం చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్)ను సోమవారం రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో బదిలీ కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత, జేసీ తేజ్‌భరత్, డీఆర్‌వో జి.నరసింహులు ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. తొలుత జేసీ తేజ్ భరత్, డీఆర్‌వో జి.నరసింహులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలి రోజు 84 అర్జీలు అందాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన రైతు మన్యం సత్యనారాయణ మూర్తి తన 7.50 ఎకరాల భూమి టిడ్కో ఇళ్ల కాలనీ మురుగునీటితో నిండి వ్యవసాయానికి పనికిరాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఉన్న భూమి టిడ్కో ఇళ్ల సరిహద్దుల్లో ఉండ డం..ఆర్అండ్‌బీ వాళ్లు రోడ్డు వెడల్పు చేసి పంటకాలువ మూసివేయడంతో సమస్య వచ్చిందని తెలిపారు.పంటకాలువను పునరుద్ధరించి న్యాయం చేయాలని కోరారు.సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. నూతన ప్రభుత్వంలో తొలి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కావడంతో అన్ని విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

24 అర్జీలు..3 తక్షణ పరిష్కారం

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రారంభించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు రాజమహేంద్రవరం కమిషనర్ పరిష్కంచారు. సోమవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ దినేష్ కుమార్ నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 24 అర్జీలు రాగా 3 అర్జీలను సోమవారమే పరిష్కరించారు. రాజేంద్రనగర్‌కు చెందిన ఎన్‌జే లివింగ్ స్టన్ ఇంటి పన్నును తన కుమారుడు పేరిట మార్చాలని పన్ను సవరించాలని అర్జీ అందజేశారు. సాయంత్రానికి పరిష్కరించి వారి కుమారుడు నూతనపాటి రాకేష్ , రాహుల్ కిరణ్‌ల పేరిట కొత్త పన్నులు విధించి ఇచ్చారు. నారాయణ పురంలో వీధి దీపాలు పనిచేయడంలేదని వీరభద్రస్వామి అర్జీ ఇవ్వడంతో వెంటనే వీధి దీపాలను పెట్టించారు. కృష్ణనగర్‌లో బురదను తొలగింపజేయాలని ,బ్లీచింగ్ చల్లించాలని అర్జీ పెట్టుకున్నారు. దీనిపై స్పందించి సమస్యను పరిష్కరించారు.

- మూడు నెలల తర్వాత నిర్వహణ
- క్యూకట్టిన బాధితులు
- పలు సమస్యలతో హాజరు
- కలెక్టరేట్‌లో 84 అర్జీలు స్వీకరణ
- పరిష్కరించాలని ఆదేశాలు
- జిల్లా అధికారులంతా హాజరు



జనటిక్ సమస్య.. ఆదుకోండి..

దుద్దుకూరు గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు అభినయ్ జనటిక్ సమస్యతో పుట్టడంతో పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు రాజాభూషణ, ప్రత్యూష వైద్యం చేయిస్తున్నారు. అయితే ఆ బాలుడికి మందులు బెంగళూరు నుంచి రప్పించడంతో నెలకు రూ.40 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ఆ ఖర్చు తట్టుకోలేక ప్రభుత్వ సహాయం కోసం కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ పెట్టుకున్నారు. గతంలో కూడా వీరు అర్జీ పెట్టుకుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారని.. అక్కడ బాబుకు అవసరమైన మందులు లేవని చెబుతున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆరోగ్యశ్రీ విభాగం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పరిశీలన చేసి బాలుడికి వైద్యం అందించాలని సూచించారు.



ఒంటరిని.. రేషన్ కార్డు ఇప్పించండి

నిడదవోలుకు చెందిన దివ్యాంగుడు వంగ కృపానంద వరప్రసాద్ తాను ఒంటరినని.. తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని జేసీ తేజ్ భరత్‌ను వేడుకున్నాడు.దీనిపై స్పందించిన ఆయన ఒంటరిగా ఉన్నవారికి కార్డు రాకపోవచ్చని చెప్పారు.అయినా వెంటనే సంబంధిత అధికారులను పిలిచి వరప్రసాద్‌కు రైస్ కార్డు ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు. సదరం సర్టిఫికెట్‌లో ఉన్న సమస్యను డీఎంహెచ్‌వోకు విన్నవించాడు.

ఎస్పీ 'మీ కోసం'కు 20 ఫిర్యాదులు



రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం' (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 20 అర్జీలను స్వీకరించిన ఎస్పీ.. వాటికి త్వరతగతిన పరిష్కారం చూపాలని ఆదేశిస్తూ సంబంధిత అధికారులకు పంపించారు. జగదీశ్ ఎస్పీగా వచ్చిన తర్వాత ప్రారంభించిన జూమ్ విధానంలో గ్రీవెన్స్ ద్వారా కూడా పలువురు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు.పలు సమస్యలపై ఆయా పోలీసు అధికారులతో జూమ్ ద్వారా ఎస్పీ మాట్లాడి అప్పటికప్పుడు పరిష్కారం చూపారు.

నల్లజర్లలో అధికారులు ఏరీ!



నల్లజర్ల మండల కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీ

నల్లజర్ల,జూన్ 24 : ప్రభుత్వ అధికారులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉన్న పట్టించుకోలేదు.నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఐదుగురు సిబ్బ ంది విధుల్లో ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు అధికారులే హాజరయ్యా రు.ఎంపీడీవో,ఏవో,మరో అధికారి కార్యాలయంలో లేరు.మండలంలో ఏఈ పీఆర్,ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జాడ కాన రాలేదు.సచివాలయ సిబ్బంది హాజరు అంతంత మాత్రంగానే ఉండడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

'నన్నయ' పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూల ప్రక్రియను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, జూన్ 24: ఏపీఆర్ సెట్‌లో అర్హత సాధించిన వారికి జియాలజీ, మేనేజ్మెంట్ విభాగాల్లో ప్రవేశాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూ ప్రక్రియను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి జియాలజీ, విభాగంలో 30 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా మేనేజ్మెంట్ విభాగంలో 320 మందికి గాను 80 మందికి జరిగాయన్నారు. మిగిలిన వారికి ఈ నెల 27వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆర్ అభ్యర్థులు సెట్ కన్వీనర్ సూచనల ప్రకారం సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో జియాలజీ, మేనేజ్మెంట్ ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు, జూన్ 24: కొవ్వూరు మండల పరిషత్ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి అంశాలపై చర్చిస్తామన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

కార్మిక సంక్షేమబోర్డును పునరుద్ధరించాలి



సమావేశంలో పాల్గొన్న భవన కార్మిక సంఘం నాయకులు

కొవ్వూరు, జూన్ 24: భవన నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. సోమవారం కొవ్వూరు సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా కార్మిక సంక్షేమ చట్టాన్ని, పథకాలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన 1214 మెమోను రద్దుచేసి చట్టబద్ధంగా సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. గత ఐదేళ్లలో ప్రమాదవశాత్తు చనిపోయిన, అంగవైకల్యం పొందిన కార్మికుల క్లైములను స్వీకరించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖైగాపుల నాగేశ్వరరావు, మద్దుకూరి దొరయ్య, మాణికిరెడ్డి హరిబాబు, వీరా త్రిమూర్తులు, కొమ్మన రాముడు, జెట్టి రామకృష్ణ, ఎస్కే ఆదామ్, పసుపులేటి వెంకటేశ్వరరావు, ఆకుమరి రాంబాబు, సిద్దిరెడ్డి బాపిరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిడదవోలు, జూన్ 24: వాసవీ వనితాక్లబ్ డాన్ టు డెస్ట్ కార్యక్రమం ద్వారా సోమవారం నిడదవోలులోని ఎల్‌బీ శాస్త్రి మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, వీధి వ్యాపారస్తులకు తోపుడు బళ్ల పంపిణీతో పాటు వృద్ధాశ్రమంలో అంధులకు చేతి కర్రలు వంటి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించామని క్లబ్ అధ్యక్షురాలు సింహాద్రి శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అంసూరి శ్రీనివాస్, గొల్లపూడి గాయత్రి, జవ్వాది శిరీష, ఉదయగిరి మణి, దివ్వెల మాధురి పాల్గొన్నారు.

అట్లపాడు పంచాయతీలో సీఎం,డిప్యూటీ సీఎంల ఫొటోలు

నిడదవోలు, జూన్ 24: నిడదవోలు మండలం అట్లపాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే కందుల దుర్గేష్ చిత్రపటాలను పాలకవర్గం, అధికార్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాయం రత్నకుమారి, కార్యదర్శి అవినాష్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సినీ నిర్మాతల సమావేశంలో మంత్రి దుర్గేష్



పవన్‌కల్యాణ్‌తో కలిసి నిర్మాతల సమావేశంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూన్ 24: అమరావతి సచివాలయంలో సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలసి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలుగు సినీ నిర్మాతల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమలోని సమస్యలు, రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధిపై చర్చ జరిగిందని, సినీ పరిశ్రమకు అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని దుర్గేష్ తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

కొవ్వూరు, జూన్ 24: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కొవ్వూరు ఎస్ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఏబీ ఎన్ పీఆర్ఆర్ డిగ్రీ, పిజి కలాశాలలో ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు అధ్యకతన సోమవారం డ్రగ్స్, మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటుపడి యువత ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని, మానశిక, శారీరకంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి చైతన్య స్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఈబీ సీఐ కేవీ.స్వామి మాట్లాడుతూ చెడువ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. సరదాగా మొదలయ్యే డ్రగ్స్, మత్తుపదార్థాల వినియోగం జీవితాల్ని, కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఎస్ఈబీ ఎస్సై సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు.. నల్లజర్ల మండలం పోతవరంలో 8 మ ద్యం సీసాలతో వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లికి తులాభారం



శేషారావుకు పటిక బెల్లంతోతూకం వేస్తున్న దృశ్యం

పెరవలి, జూన్ 24: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తే మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు పటికబెల్లంతో తులాభారం వేస్తానని పెరవలికి చెందిన కాకిలేటి నరేష్ మొక్కుకున్నాడు. దీనిలో భాగంగా సోమవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో శేషారావుకు పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నాడు. కార్యక్రమంలో సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, సలాది శ్రీహరి, పసలపూడి భద్రయ్య, కాకిలేటి నరేష్ పాల్గొన్నారు.

ఎన్నికల పారితోషికాలు ఇవ్వండి

- ఫొటో, వీడియోగ్రాఫర్లు, సచివాలయ కార్యదర్శులు
- ధాన్యం బకాయిలు చెల్లించండి : రైతులు
- సబ్‌కలెక్టర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, జూన్ 24: గోపాలపురం నియోజకవర్గ ఫొటో, వీడియోగ్రాఫర్లకు సార్వత్రిక ఎన్నికల విధుల పారితోషికం చెల్లించాలని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. రోజుకు రూ.2250 చొప్పన చెల్లించే విధంగా 59రోజులు 30మంది పనిచేశామన్నారు.దానికి సంబంధించిన సొమ్మును తహశీల్దార్‌కు చెక్కును పంపించినట్టు కలెక్టర్ చెప్పారని, అయితే ఎటువంటి సొమ్ము రాలేదని, కలెక్టర్‌ను అడగాలని తహశీల్దార్ చెబుతున్నారన్నారు. అన్ని నియోజకవర్గాల్లో 70శాతం సొమ్ము చెల్లిస్తే, గోపాలపురంలో 20శాతం మాత్రమే చెల్లించారని, మిగిలిన సొమ్ము చెల్లించాలని 45 రోజులుగా కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నామని ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గెల్లా రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సూర్య, దేశాబత్తుల శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అలాగే ఎన్నికల విధులు నిర్వర్తించిన సచివాలయ కార్యదర్శులకు పారితోషకాలు ఇవ్వలేదని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే దొమ్మేరు గ్రామానికి చెందిన కేవీకే రంగారావు వైసీపీ ప్రభుత్వంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలను చెల్లించాలని ఫిర్యాదు చేశారు. ధాన్యం విక్రయించి 60రోజులు దాటుతున్నా సొమ్ములు ఖాతాల్లో జమ చేయకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రావడంతో ధాన్యం బకాయిలు చెల్లించడానికి ఆలస్యమైందని, దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవ తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లజర్లలో భూ సమస్యలపై రెండు ఫిర్యాదులు

నల్లజర్ల, జూన్ 24: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభించారు. అనంతపల్లికి చెందిన మీసాల శ్రీనివాస్‌కు చెందిన భూమి అన్‌లైన్ చేయలేదని ఫిర్యాదు చేశాడు. అదే గ్రామానికి చెందిన సీపాని తులసీరామ్‌కి భూమి ఉన్న సర్వే నెంబరు కేటాయించలేదని ఫిర్యాదు చేశారు. నూతనంగా పింఛన్, రేషన్‌కార్డులోకి సభ్యులు చేరిక వంటి సమస్యలను పలువురు వేదిక దృష్టికి తీసుకొచ్చారు. కాగా ప్రతి సమస్యను పరిష్కారిస్తామని తహశీల్దార్ కృష్ణారావు అన్నారు.

చాగల్లులో ఐదు దరఖాస్తులు

చాగల్లు, జూన్ 24: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐదు దరఖాస్తులు స్వీకరించినట్టు తహశీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. కొత్త పెన్షన్ల మంజూరు, డ్రైనేజీ నిర్మాణం, ఉపాధి హామీ బ్యాంకు ఖాతా తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న ఎండీయూను తొలగించాలి

కరిచర్లగూడెం టీడీపీ నాయకుల ఫిర్యాదు



తహశీల్దార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

గోపాలపురం, జూన్ 24: ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలు ఉల్లంగించి వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఎండీయూను తొలగించాలని కరిచర్లగూడెం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బాషా, బీసీ సెల్ మండలాధ్యక్షుడు వేముల నాగరాజు ఫిర్యాదు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారిద్దరూ మాట్లాడుతూ ఎండీయూగా పనిచేస్తున్న ధనరాజు ఎన్నికల ప్రచారంలో వైసీపీ తరపున కండువాలు ధరించి మరీ ప్రచారంలో పాల్గొన్నాడన్నారు. దీనిపై అప్పటి ఎన్నికల అధికారి కేఎల్ శివజ్యోతికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని అన్నారు. అయితే అధికారులు ఎండీయూపై క్రిమినల్ కేసు నమోదు చేశామని, విధుల నుంచి తప్పిస్తున్నామని తెలిపామన్నారు. కాని అతడి వద్ద నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకోలేదని, నాటి నుంచి నేటి వరకు అదే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారన్నారు. దీనిపై స్పందించి చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఖాళీ.. కాగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంతో పాటు తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. అయితే మండల స్థాయి అధికారులంతా ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరుకావడంతో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కుర్చీ మినహా మిగిలిన కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



మలకపల్లిలో కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జూన్ 24: కొవ్వూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మలకపల్లిలో స్థానిక నాయకులు నిర్వహించిన విజయోత్సవ రాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానిక కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రధాన మంత్రి మోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మద్దిపాటి ప్రకాశం, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఉపసర్పంచ్ మద్దిపాటి రామారావు, జనసేనపార్టీ ఇన్‌చార్జి టీవీ రామారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, బూరుగుపల్లి వీరరాఘవులు, టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు నామన పరమేశ్వరరావు, ఇందుగుల రామకృష్ణ, నాయకులు పోకనాటి ముత్యాల రావు, రాగు చిన్ని, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, చెరుకూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి

- పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో ఎంపీడీవో రమేష్



గోపాలపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్

గోపాలపురం, జూన్ 24: వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని ఎంపీడీవో కె.రమేష్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అతిసార వ్యాధి నియంత్రణపై పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి పైపుల లీకేజీ, చెత్తచెదారం తొలగింపుపై యుద్ధప్రతిపాదికన పని చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చాగల్లులో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బుజ్జి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం

చాగల్లు: స్థానిక ఎంపీడీవో కార్యాలయలంలో జరిగిన మండల స్థాయి టాస్క్‌ఫోర్సు సమావేశంలో ఎంపీడీవో ఎస్.బుజ్జి మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ప్రతిరోజు క్లోరినేషన్ చేసిన నీటినే తాగునీరుగా సరఫరా చేయాలన్నారు. ఎక్కడైనా డయేరియా కేసులు గుర్తిస్తే వెంటనే వైద్యసిబ్బందికి తెలియజేయాలన్నారు. ఇంటింటి సర్వే చేసి జ్వరాలున్న వారిని గుర్తించాలన్నారు. సమావేశంలో విస్తరణ అధికారి ఆర్.శ్రావణ్‌కుమార్, డాక్టర్ కె.నిశిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశరావుపాలెంలో యువకుడి హత్య?

అనుమానాస్పదమృతిగా కేసు నమోదు

నల్లజర్ల, జూన్ 24: నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన బుసనబోయిన సతీష్(24) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. సతీష్ బోరు రిగ్ పనులుకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు.ఆదివారం రాత్రి బయటకు వెళుతున్నట్టు తల్లి పెద్దబుజ్జికి చెప్పాడు. సోమవారం ఉదయం ప్రకాశరావుపాలెం వాటర్ ట్యాంక్ వద్ద మృతి చెంది ఉండడంతో గ్రామస్థులు.. తల్లికి, పోలీసులకు సమాచారం అందించారు.మృతదేహంపై గాయాలు, చెవి నుంచి రక్తం వచ్చిన ఆనవాలు, కాలు విరిగిపోయి ఉన్నాయి.అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని సీఐ చెప్పారు.

వేంకటేశ్వరస్వామి విగ్రహం ధ్వంసంపై కేసు



పెరవలి, జూన్ 24: ఖండవల్లిలో జాతీయ రహదారి పక్కన దుర్గమ్మ గుడి సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. స్థానిక ఎస్ఐ వివరాల ప్రకారం.. గత నెల 10న స్థానిక కనకదుర్గమ్మ గుడి పక్కన మార్కెట్ యార్డు స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని కొంతమంది ఏర్పాటు చేశారు. దీనిపై వీఆర్‌వో ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అనంతరం కనకదుర్గమ్మ గుడి కమిటీ సభ్యులు ఈ విగ్రహం ప్రతిష్ఠాపనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక ప్రజానీకంతో సమావేశం నిర్వహించినప్పటికీ ఎటు తేలలేదు. ఇదిలా ఉండగా 3వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ స్థలంలో విగ్రహాన్ని తీసి రైతు భరోసా కేంద్రం వద్దకు తెచ్చి పెట్టారు. ఈ క్రమంలో విగ్రహంలో కొంత భాగం ధ్వంసమైందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఏజీఎస్ మూర్తి తెలిపారు.

బిక్కవోలు ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

బిక్కవోలు, జూన్ 24: బిక్కవోలు వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌చౌదరి, కార్యదర్శిగా రఘు, కోశాధికారిగా బులిస్వామిరెడ్డి, సహకోశాధికారిగా పోలరాజులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు అభినందించారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

అవగాహన సదస్సులో సీడీపీవో ఝాన్సీరాణి



గోకవరం, జూన్ 24: మానవ అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యతని సీడీపీవో ఝాన్సీరాణి అన్నారు. గోకవరంలోని మండల సమాఖ్య సమావేశ హాల్లో సోమవారం హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన సదసుస్సలో ఆమె మాట్లాడారు. ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో ప్రతి రోజు ఎంతోమంది యువతులు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నా రన్నారు. సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ వరలక్ష్మి మాట్లాడుతూ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల సంస్థ 28 ఏళ్లుగా పోరాడుతూ ఇప్పటి వరకు 28,200మంది యువతులు, మహిళలను కాపాడి వారికి పునరావసం కల్పించిందన్నారు.అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ వచ్చినపుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రమాదా నికి గురైన సందర్భంలో 1930 టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించాలని వివరించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు లఘుచిత్రాల ద్వారా అవగాహన కలిగించారు.

నాక్ పర్యటన విజయవంతం చేయాలి

సీతానగరం, జూన్ 24: ఈ నెల 27, 28 తేదీల్లో సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగనున్న నాక్ కమిటీ పర్యటనను విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ డి.చిట్టిబాబు కోరారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ పర్యటనలో కళాశాలల్లో ఉన్న సౌకర్యాలు, సదుపాయాలు, పరిశీలించి కళాశాలలకు గ్రేడ్‌లను కేటాయిస్తారన్నారు. అలాగే చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అలాగే కళాశాల అభివృద్ధి కమిటీతో సమావేశం ఉంటుందని, ఈ కార్యక్రమంలో ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు తప్పక పాల్గొనాలని కోరారు.

చట్టప్రకారమే ప్రభుత్వ చర్యలు : గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 24 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చట్టప్రకారమే చేపడుతున్న చర్యలు చేపడుతుందని.. ఎటువంటి కక్షసాధింపులు లేవని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ కార్యాలయాలు చూస్తుంటే ప్యాలెస్‌ల్లా ఉన్నాయన్నారు. పార్టీ కార్యాలయాలు కట్టుకోవడం తప్పుకాదు కానీ ఎటువంటి అనుమతులు లేకుండా వారి జేబు సంస్థతో నిర్మింపజేసుకున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకుడు మళ్ల వెంకట్రాజు పాల్గొన్నారు.

పుల్లా, కొత్తూరి కుటుంబాలకు పరామర్శ

కడియం, జూన్ 24: ఇటీవల మాతృ వియోగం పొందిన పుల్లా రామారావును, కొత్తూరి బాలనాగేశ్వరరావు-కృష్ణ సోదరులను సోమవారం టీడీపీ నాయకుడు గన్ని కృష్ణ వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమాల్లో గంగిన హనుమంతరావు, ఆళ్ల ఆనందరావు, మత్యేటి ప్రసాద్, పందూరి అప్పారావు, పిన్నింటి ఏకబాబు, ధర్మరాజు, రాయుడు సతీష్, గిరజాల శ్రీను, ధర్మరాజు, పలువురు నర్సరీరైతులు పాల్గొన్నారు.

యువతలో నైతిక విలువల పెంపునకు కృషి

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 24: యువత వ్యసనాలకు బానిసలు కాకుండా నైతిక విలువలు పెంపొందించేందుకు స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఐవో) పలు కార్యక్రమాలు చేపడుతోందని సంస్థ రాష్ట్ర సలహామండలి సభ్యుడు జాఫర్ షరీఫ్,నగర అధ్యక్షుడు ఆసిఫ్ అహ్మద్ అన్నారు. నెహ్రూనగర్ బిలాల్ మసీదులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువత, లక్ష్యరహిత జీవితంతో నైతిక పతనానికి లోనై, ఉన్నతమైన జీవిత లక్ష్యాలను విస్మరిస్తున్నారన్నారు. ఇటువంటి యువతలో మానసిక స్థైర్యం నింపడానికి సామాజిక అభివృద్ధి పేరుతో జూలై 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. రాజమండ్రి శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నగర కార్యదర్శి అమాన్, మీడియా కార్యదర్శి ఉమర్ పాల్గొన్నారు.

28న ఆర్టీసీ అన్‌ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24: రాజమహేంద్రవరం ఆర్టీసీ పార్శిల్ ఆఫీస్‌లో అన్ ఐడెంటిఫైడ్/అన్ క్లైయిమ్డ్ పార్శిల్స్‌ను ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ కార్గో ఏటీఎం కె.మాధవ్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరం బస్టాండ్ ఆవరణలోని పార్శిల్ ఆఫీసు వద్ద వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు పాల్గొనవచ్చని కోరారు.

'ఆర్ట్స్' అధ్యాపకులకు 5 పరిశోధన ప్రాజెక్టులు



పరిశోధన ప్రాజెక్టులు సాధించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులకు రూస 2.0 పథకం కింద రూ.24 లక్షల విలువైన ఐదు పరిశోధన ప్రాజెక్టులను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రూసా విభాగం ప్రకటించింది. కళాశాల ప్రిన్సిపాల్, భౌతికశాస్త్ర అధ్యాపకులు రామచంద్ర ఆర్‌కేకు రూ.10 లక్షలు, భూగర్భశాస్త్ర అధ్యాపకుడు ఎంఆర్ గౌతమ్‌కు రూ.5 లక్షలు, వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడు బీపీ నర్సారెడ్డికి రూ.3 లక్షలు, అర్థశాస్త్ర అధ్యాపకుడు డీవీ నాగేశ్వరరావుకు రూ.3 లక్షలు, సీతామహాలక్ష్మి కస్తూరికి రూ.3 లక్షలు కేటాయించినట్టు ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. అవకాశాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకుని భావి తరాలకు ఆదర్శమైన పరిశోధనలు, గొప్ప ఫలితాలను అందించాలని కోరారు.

పూర్వ విద్యార్థులకు పర్మినెంట్ ఐడీ నెంబర్స్

రాజమహేంద్రవరం సిటీ,జూన్ 24: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ, పీజీ పూర్తి చేసుకున్న ప్రతి పూర్వ విద్యార్థికి పర్మినెంట్ ఐడీ నెంబరు ఇచ్చినట్టు ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్ తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సోమవారం కళాశాల పూర్వ విద్యార్థులకు ఐడీలను అందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ భార్గవ్, గద్దే సుధాకర్, ఎస్.విజయలక్ష్మి, జి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీతలు వేగవంతం చేయండి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 24: వర్షాలు ప్రారంభమవుతున్న తరుణంలో రాజమహేంద్రవరంలోని కాలువల్లో పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మోరంపూడి, వెంకటేశ్వర మార్కెట్, ఎస్‌వీజీ మార్కెట్ గుండా ప్రవహించే కాలువల్లో పూడిక తీత పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పిడింగొయ్యి గ్రామ పరిధిలోనూ డ్రైనేజీలు పూడిత తీత తీయించాలని పంచాయతీ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వినూత్న, పిడింగొయ్యి సెక్రటరీ రూప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

కన్నమాంబ జాతరను ప్రశాంతంగా జరుపుకోండి



రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఆల్కట్‌తోటలో రామాలయం కమిటీ శెట్టిబలిజ సంఘం మంగళవారం నిర్వహిస్తున్న కన్నమాంబ జాతర సందర్భంగా ఆలయ పెద్దలతో సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ సమావేశమయ్యారు. ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు, అల్లర్లకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జాతర జరుపుకోవాలన్నారు. మెయిన్ రోడ్డుపై ఊరేగింపు వెళ్లే సమయంలో ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించవద్దన్నారు. జాతరలో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోరంట్ల గవర్నర్ పదవికి సమర్థుడు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 24: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గవర్నర్ పదవికి సమర్థుడని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ సైనిక సెల్ చైర్మన్ నున్న మోహన్‌రావు చౌదరి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం, జూన్ 24: మండలంలోని వీరలింకపల్లిలో అంబేడ్కర్ గురు కుల బాలికల పాఠశాలలో 6నుంచి 9వ తరగతి వరకు ప్రవేశానికి దరఖా స్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎంపీ రాణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 25 నాటికి విద్యార్థులు తమ దరఖాస్తులను అందజేయాలని, 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 9441102187కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.